

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయానికి కూటమి పార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేస్తాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 13.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 173 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# తిరుపతికి మహర్దశ



- రూ.3,222 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- అలిపిరి వద్ద రూ.2,750 కోట్లతో యాత్రికుల టౌన్‌షిప్
- 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం
- టీటీడీ ఉద్యోగుల నివాస లేఅవుట్ పనులు ప్రారంభం
- 'వెంకటాద్రి' యాప్‌ను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుమల--తిరుపతి ప్రాంతాన్ని మరింత అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టీటీడీ పరిధిలో రూ. 3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యాలను కల్పించేందుకు రూ. 2,750 కోట్లతో సమీకృత టౌన్‌షిప్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సురక్షితమైన, ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఎస్వీ జూపార్కు రహదారి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం రూ. 2,750 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో వసతి, అన్నప్రసాదం, విశ్రాంతి, రవాణా, పార్కింగ్, వైద్య సేవలు, డిజిటల్ సమాచార కేంద్రాలు సహా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురానున్నారు. భక్తుల వసతి కోసం రూ. 1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో పది అంతస్తుల చొప్పున మొత్తం 2,700 గదులను నిర్మించనున్నారు. వీటి ద్వారా రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి కల్పించే అవకాశం ఉంది. తిరుమల కొండపై వసతులపై ఒత్తిడిని తగ్గించడంతోపాటు, తిరుపతిలోనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. అన్నదానం అత్యంత పవిత్రమైన సేవ అని పేర్కొన్న ముఖ్యమంత్రి... ఆకలితో వచ్చిన భక్తులకు అన్నప్రసాదం, అలసిపోయిన వారికి వసతి కల్పించడం ద్వారా దేవదేవుడికి సేవ చేసినట్లేనని అన్నారు. ఇందులో భాగంగా రూ. 160 కోట్లతో నిర్మించనున్న అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులకు ఆహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు రూ. 311 కోట్లతో

మిగతా 2లో...

# ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

- ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం ఉండాలి
- కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించండి
- 175 నియోజకవర్గాల నోడల్ అధికారుల పనితీరుపై దృష్టి
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు



2లో

## నిరుపేద కుటుంబాలకు అండగా 'సమావేశి ఆజీవిక యోజన'

- 10,000 కుటుంబాలకు జీవనోపాధి కల్పనకు శ్రీకారం
- రాష్ట్రంలో అత్యంత పేదరికానికి చరమగీతం
- అభివృద్ధి ఫలాలు నిరుపేదలకు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సమావేశి ఆజీవిక యోజన' (ఎస్ఏవై) అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనదయాళ్ అంత్యోదయ యోజన – జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (డీఏవై–ఎన్ఆర్ఎల్ఎం) కింద ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. తీవ్ర పేదరికం వల్ల స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) పరిధిలోకి రాని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందని నిరుపేద కుటుంబాలను గుర్తించి, పేదరికం నుంచి బయటపడేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని మంత్రి తెలిపారు.

మిగతా 3లో...

## సివిల్స్ సాధనకు పీ4 చేయూత

- బీసీ యువతకు ఏటా 100 మందికి ఉచిత కోచింగ్
- లక్ష్యయ్య ఐఏఎస్ అకాడమీతో ఒప్పందం



2లో

## గ్రూప్-2కు ఉచిత శిక్షణ



- మైనారిటీ అభ్యర్థులకు ప్రభుత్వం అవకాశం
- ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలి
- మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రకటన

2లో

## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ పురస్కారం



**స్టాక్‌హోమ్ :** ఆర్థిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం అమెరికా శాస్త్రవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లకు దక్కింది. 2026 సంవత్సరానికి గాను వారిని ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ప్రకటించింది.

మిగతా 2లో...

# ఏపీ.. పెట్టుబడుల స్వర్గధామం

- పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకారం
- రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి
- కాకినాడలో రూ.6,347 కోట్ల పెట్టుబడులు
- 18 వేల మందికి ఉపాధి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు




**కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితి ఉండేదని, రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తమకేమిస్తారని అడిగే విష సంస్కృతి అప్పట్లో ఉండేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు రాష్ట్రాన్ని స్వర్గధామంగా మారుస్తోందని పేర్కొన్నారు. మీరు పెట్టుబడులు పెడితే రాష్ట్రానికి ఏం ఇస్తారు..? ప్రజలకు ఏం చేస్తారు..? అని అడిగి సత్సంప్రదాయంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పరిశ్రమలకు రాష్ట్రంలో అపార అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకొని ఆంధ్రప్రదేశ్ పురోగతిలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాకినాడ జేఎన్టీయూలో సోమవారం జరిగిన సీఐఐ ప్రాంతీయ సదస్సుకు పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "విశ్రాంత ఉద్యోగుల ప్యారడైజ్ నగరంగా భావించే కాకినాడలో తొలిసారి సీఐఐ ప్రాంతీయ సదస్సు జరగడం ఆనందంగా ఉంది.

మిగతా 3లో...

## కారులో సజీవ దహనం



- విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఘోర ప్రమాదం
- నలుగురు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- మృతులు నంబూరు, నున్న వాసులుగా గుర్తింపు

2లో

## 12వ పీఆర్సీకి సారథిగా దినేష్ కుమార్

- చైర్మన్‌గా దినేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ
- వేతన సవరణపై అధ్యయనం.. ఏడాదిలోగా నివేదిక



**అమరావతి,అక్టోబరు12 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల పెంపుదలకు సంబంధించిన 12వ వేతన సవరణ సంఘం చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఆయన సోమవారం ఏపి సచివాలయంలో పిఆర్సి చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. 1983 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన ఆయన గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఈనెల 1వ తేదీన దినేష్ కుమార్ చైర్మన్ గా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జిఓఎంఎస్ సంఖ్య 200 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది లోగా పిఆర్సి నివేదికు సమర్పించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్న నేపథ్యంలో ఆయన పిఆర్సి చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు. పిఆర్సి చైర్మన్ గా రాష్ట్రంలో గల అన్ని ప్రభుత్వ శాఖల నుండి సమాచారాన్ని తీసుకోవడంతో ఉద్యోగులు ఉద్యోగ సంఘాల నుండి పూర్తి వివరాలు సేకరించి పూర్తి స్థాయి అధ్యయనం చేసిన తదుపరి వేతనాల పెంపుదలకు సంబంధించి ఏడాది గడువులోగా పిఆర్సి నివేదికను దినేష్ కుమార్ ప్రభుత్వానికి సమర్పిస్తారు.

పిఆర్సి చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన దినేష్ కుమార్ ను రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి వి. వినయ్ చంద్, అదనపు కార్యదర్శి గౌతమ్ అల్లాడలు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ ఆఉద్యోగ సంఘం ప్రతినిధులు దినేష్ కుమార్ ను కలిసి పుష్పగుచ్ఛం అందించి దుస్సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రపతి రాకకు సర్వం సిద్ధం

- రెండు రోజుల పాటు విజయవాడలో ద్రౌపది ముర్ము పర్యటన
- 14న ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనం
- 15న పున్నమి ఘాట్‌లో సరస్ మేళాకు హాజరు
- ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



**అమరావతి,అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్):** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 14,15తేదీల్లో విజయవాడ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి రాష్ట్రపతి సచివాలయం నుండి జారీ అయిన మార్గదర్శకాలను తు.చ:తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని ఆలస్యం లేకుండా సమయపాలనకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

మిగతా 3లో...

## మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు

- 17 కార్పొరేషన్ల మేయర్ స్థానాలకు వర్గాల వారీగా కేటాయింపులు
- బీసీలకు 5.. ఎస్సీలకు 2.. ఎస్టీకి ఒకటి
- జనరల్ మహిళలకు 5.. అన్‌రిజర్వ్‌డ్ స్థానాలు 4
- 106 మున్సిపాలిటీ రిజర్వేషన్లు ఖరారు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను ఏపీ ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలోని మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించింది. బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీకి 1, జనరల్ మహిళలకు 5, అన్‌రిజర్వ్‌డ్ కోసం 4 స్థానాలు కేటాయిస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు మున్సిపాలిటీలకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 106 మున్సిపాలిటీ అధ్యక్ష పీఠాల్లో ఎస్టీలకు మూడు, ఎస్సీలకు 14, బీసీలకు 36, జనరల్‌కు 53 సీట్లు కేటాయించారు.

మున్సిపల్ కార్పొరేషన్లు- మేయర్ రిజర్వేషన్

మంగళగిరి తాడేపల్లి - ఎస్టీ

2లో

## ఐఏఎస్‌ల బదిలీలు.. పోస్టింగ్‌లు

- పర్యాటక శాఖ కార్యదర్శిగా ఆమ్రపాలి కాటా
- గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా మురళీధర్ రెడ్డి
- ఏపీ భవన్ ఓఎస్‌డీగా సౌరభ్ గౌర్
- మొత్తం 11 మందికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు

3లో

# ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించగలుగుతున్నామని, మరింత వేగంగా, సమర్ధవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ సమావేశంలో 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలన్నారు. వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని... జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్ధంగా సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సివిల్స్ సాధనకు పీ4 చేయూత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పీ4 మోడల్‌లో దేశంలోనే తొలిసారిగా బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ అందించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. ఇందుకోసం డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీతో బీసీ సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు.

ఏటా 100 మంది బీసీ అభ్యర్థులకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ, స్టడీ మెటీరియల్‌తో పాటు ఉచిత వసతి కల్పిస్తామని మంత్రి తెలిపారు. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు పీ4 ఫౌండేషన్ తరఫున రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు.

బీసీ యువత ఉన్నత స్థానాల్లో కొలువుదీరాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని సవిత అన్నారు. గత రెండేళ్లలో 200 మందికి ఉచిత సివిల్స్ కోచింగ్ అందించామని, 2025 మెగా డీఎస్సీ, గ్రూప్–1కు కూడా శిక్షణ ఇచ్చామని తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఉచిత శిక్షణ ప్రారంభిస్తామన్నారు.

బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్‌తో పాటు డీఎస్సీ, గ్రూప్–1, ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని మంత్రి తెలిపారు. మంత్రి సవిత సమక్షంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు.

# గ్రూప్-2కు ఉచిత శిక్షణ



**అమరావతి, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న గ్రూప్–2 ఉద్యోగాల కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ నెలాఖరు 31వ తేదీ లోగా అర్హత కలిగిన వారందరూ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని అమరావతి లో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి కోరారు. మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్(సిఈడియం) నేతృత్వంలో అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్–2 నియామక పరీక్షల కోసం ఆన్ లైన్/ఆఫ్ లైన్ లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు. ఇందులో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. బిపిఎల్ కార్డు కలిగి ఉండటం ఆఫ్‌లైన్ కోచింగ్‌కు తప్పనిసరి అర్హతగా పరిగణించబడుతుందని వెల్లడించారు. దరఖాస్తు సమయంలో సంబంధిత బిపిఎల్ కార్డు( తెల్ల రేషన్ కార్డు)/ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. గ్రూప్ –2 ఉద్యోగాల సాధన కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ తో పాటు విద్యాపరమైన మద్దతును అందించడమే ఉచిత శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో రాత పరీక్ష సన్నద్ధత, జనరల్ స్టడీస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్ తో పాటు నియామక పరీక్షకు నిర్దేశించిన ఇతర సంబంధిత అంశాలపై పూర్తి దృష్టి సారిస్తారని తెలిపారు. మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు, నిర్దేశించిన అర్హతా షరతులకు లోబడి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత,ఆసక్తిగల రాష్ట్రవ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను"సిఈడియం–ఏపీ" అధికారక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని కోరారు.

వెబ్ సైట్ : www.apcedmmwd.org లేదా సెల్ నెంబర్లు: 08645–297535 7386789966 లను సంప్రదించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు

**న్యూఢిల్లీ:** ఆరు రాష్ట్రాల్లో గవర్నర్లను మారుస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ వివరాలను రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. కేరళంతో పాటు తమిళనాడుకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రాజేంద్ర అర్లేకర్ ను తమిళనాడుకు పూర్తిస్థాయి గవర్నర్‌గా నియమించారు. సిక్కిం గవర్నర్‌గా పనిచేస్తున్న ఓపీ మాథుర్ కేరళం గవర్నర్‌గా ఎంపిక చేశారు. కర్ణాటక గవర్నర్‌గా సుధా యాదవ్‌ను, ఒడిషా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ రామ్‌ను, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా ధల్ సింగ్ బిసెన్‌ను నియమించారు. బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్రపతిభవన్ తన ప్రకటనలో తెలిపింది. ఈ కొత్త గవర్నర్ల పదవీకాలం వారు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచే అమల్లోకి వస్తుందని ఈ ప్రకటన తెలిపింది. అయితే వీరు ఎప్పుడు నుంచి బాధ్యతలు స్వీకరిస్తారో ఆ తేదీని మాత్రం పేర్కొనలేదు.

# తిరుపతికి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. రూ. 90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన సమీకృత రవాణా టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులు :** తిరుపతి నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ. 242 కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. మొత్తం 20 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ పనుల్లో తుడా రూ. 127 కోట్లతో 16.50 కిలోమీటర్లు, టీటీడీ రూ. 115 కోట్లతో 3.60 కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేయనున్నాయి. ఈ రహదారులు జాతీయ రహదారులు 140, 71 మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడంతోపాటు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నాయి. శ్రీవారి సేవలో నిరంతరం నిమగ్నమయ్యే టీటీడీ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబాలు సొంతింటిలో ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో 418 ఎకరాల్లో నివాస లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మొదటి, రెండో దశల్లో కలిపి మొత్తం 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో టీటీడీ వాటాగా రూ. 150 కోట్లు, ఉద్యోగుల వాటా రూ. 80 కోట్లు వ్యయం చేయనున్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, నీటి సరఫరా పైప్‌లైన్లు, మురుగునీటి శుద్ధి కేంద్రం, విద్యుత్ పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ఈ టౌన్ షిప్ ను పర్యావరణ హితంగా నెట్‌జీరో గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం ఉంటే వారు మరింత అంకితభావంతో భక్తులకు



సేవలందించగలరని సీఎం అన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో సేవాభావంతో పనిచేస్తున్న టీటీడీ సిబ్బందిని అభినందించారు.

**ఆధ్యాత్మిక అనుభూతి... ఆధునిక సాంకేతికత :** తిరుమల చరిత్ర, శ్రీవారి వైభవం, ఆధ్యాత్మిక సంప్రదాయాలను భక్తులకు పరిచయం చేసేందుకు పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. డిజిటల్ సమాచార కేంద్రం, అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు తిరుపతి నుంచి వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ సంతృప్తికరమైన అనుభూతిని పొందేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. భక్తులకు సమాచారం తెలిపేందుకు రూపొందించిన వెంకటాద్రి యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. తిరుమల తరహా పవిత్రత దిగువన తిరుపతిలోనూ అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా, ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక సాంకేతికత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తిరుపతిలోని చెరువులన్నింటినీ అనుసంధానించి సుందరంగా తీర్చిదిద్దాలని, కల్యాణి డ్యామ్ వరకు ఉన్న ప్రాంతాన్ని సమర్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. ఔషధ మొక్కల ప్రాంతాన్ని సందర్శకులకు ఆధ్యాత్మిక, ప్రకృతి అనుభూతిని అందించే ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలన్నారు. వృక్షో గోవింద కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, గోశాలల నిర్వహణ, గోసేవను ప్రోత్సహించాలని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

**వివాహాలు, సదస్సులు, క్రీడలకు కేంద్రంగా అభివృద్ధి :** అన్నదానం, ప్రాణదానం, విద్యా దానం వంటి సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీవారి సేవకుల తరహాలో ఇతర దేవాలయాల్లోనూ సేవా వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రజలను సన్మార్గంలో నడిపించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని, ముఖ్యంగా యువతలో ఒత్తిడిని తగ్గించి, ఆధ్యాత్మికత వైపు నడిపించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆధ్యాత్మికతను సాంకేతికతతో కలిపి ముందుకు తీసుకెళ్లాలని, శ్రీవారి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింతగా చాటిచెప్పే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. పవిత్రత విషయంలో ఎక్కడా రాజీపడబోమని సీఎం స్పష్టం చేశారు. మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలతో తిరుపతి త్వరలోనే వివాహ వేడుకలకు ప్రముఖ గమ్యస్థానంగా మారే అవకాశముందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తే నగరంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని చెప్పారు. క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు, ఏసీఏ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక యువతకు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కల్పించాలని, ఉపాధి అవకాశాలు పెంచేలా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**సమష్టి కృషితో ఆదర్శ నగరంగా తిరుపతి :** దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులు, యాత్రికులు తిరుపతిని చూసి రాష్ట్రం గురించి అంచనా వేస్తారని, అందుకే ఈ నగరాన్ని అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. దేవాదాయ, పర్యాటక, పురపాలక శాఖలు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. పురపాలక శాఖ పట్టణాల అభివృద్ధితోపాటు ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా పనిచేయాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, టీటీడీ ఉద్యోగుల సంక్షేమం, తిరుపతి నగర మౌలిక సదుపాయాల విస్తరణ ఈ లక్ష్యాలను సమన్వయం చేస్తూ తిరుపతిని దివ్యక్షేత్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం. రవిచంద్ర, పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

రాజమహేంద్రవరం – ఎస్సీ
కర్నూలు – ఎస్సీ
మచిలీపట్నం – బీసీ మహిళ
కాకినాడ – బీసీ మహిళ
ఏలూరు – బీసీ జనరల్
అనంతపురం – బీసీ జనరల్
చిత్తూరు – బీసీ జనరల్
విజయనగరం – జనరల్ మహిళ
శ్రీకాకుళం – జనరల్ మహిళ
గుంటూరు – జనరల్ మహిళ
కడప – జనరల్ మహిళ
విశాఖ – జనరల్ మహిళ
తిరుపతి – అన్‌రిజర్వ్‌డ్
విజయవాడ – అన్‌రిజర్వ్‌డ్
ఒంగోలు – అన్‌రిజర్వ్‌డ్
నెల్లూరు – అన్‌రిజర్వ్‌డ్

106 మున్సిపాలిటీ అధ్యక్ష పీఠాలు : మరోవైపు మున్సిపాలిటీలకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 106 మున్సిపాలిటీ అధ్యక్ష పీఠాల్లో ఎస్టీలకు మూడు, ఎస్సీలకు 14, బీసీలకు 36, జనరల్‌కు 53 సీట్లు కేటాయించారు. పురపోరుకు షెడ్యూల్, నోటిఫికేషన్ బుధవారం వెలువడనున్న వేళ ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. మున్సిపాలిటీ అధ్యక్ష పీఠాలకు సంబంధించి ఎస్టీలకు కేటాయించిన మూడింటిలో ఒక చోట మహిళకు దక్కింది. ఎస్సీలకు 7 చోట్లు, ఎస్సీ మహిళకు 7 చోట్ల ఇచ్చారు. బీసీలకు 18



చోట్లు, బీసీ మహిళకు 18 చోట్ల కేటాయించారు. జనరల్– 26 చోట్లు, జనరల్ మహిళకు 27 చోట్ల కేటాయింపులు జరిపారు.

తణుకు, తెనాలి, గురజాల, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలను జనరల్‌కు కేటాయించారు. అమలాపురం, ఎమ్మిగనూరు, కావలి, ప్రొద్దుటూరు, నందిగామ, కందుకూరు, మండపేట, దాచేపల్లి, నగరి, చీమకుర్తి, రాయదుర్గం, గిద్దలూరు, వినుకొండ జనరల్‌కే ఇచ్చారు. గొల్లప్రోలు, అద్దంకి, పెద్దాపురం, ధర్మవరం, బద్వేలు, దర్శి, మార్కాపురం, మైదుకూరు, నరసరావుపేట కూడా జనరల్‌కే కేటాయించారు.

కనిగిరి, కమలాపురం, కొవ్వూరు, వెంకటగిరిని జనరల్ మహిళకు కేటాయించారు. బుచ్చిరెడ్డిపాలెం, ఎలమంచిలి, కల్యాణదుర్గం, నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, నరసాపురం, పలాస, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పొన్నూరు, భీమవరం, చిలకలూరిపేట, జగ్గయ్యపేట, ఆమదాలవలస, మాచర్ల కూడా జనరల్ మహిళకే ఇచ్చారు.

కర్నూలు జిల్లా ఆత్మకూరు, ఆలూరు మున్సిపాలిటీలను ఎస్టీలకు కేటాయించారు. గూడూరు మున్సిపాలిటీని ఎస్టీ మహిళకు ఇచ్చారు. ఉయ్యూరు, సామర్లకోట, పిఠాపురం, నూజివీడు, కుప్పం, పొదిలి, బాపట్ల పీఠాలను ఎస్సీలకు కేటాయించారు. చింతలపూడి, సూళ్లూరుపేట, కొండపల్లి, నిడదవోలు, ఏలేశ్వరం, గుత్తి, చీరాల మున్సిపాలిటీలను ఎస్సీ మహిళకు ఇచ్చారు.

పిడుగురాళ్ల, పుత్తూరు, బేతంచర్ల, రామచంద్రాపురం, సత్తెనపల్లి, శ్రీకాళహస్తి, మదనపల్లె, తాడిపత్రి మున్సిపాలిటీలను బీసీలకు కేటాయించారు. తిరువూరు, నంద్యాల, హిందూపురం, మడకశిర, నెల్లిమర్ల, పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, తాడిగడప, బి.కొత్తకోట కూడా బీసీలకే దక్కాయి. పాలకొండ, తుని, పాలకొల్లు, కదిరి, పుంగనూరు, రాజంపేట, గుడివాడ, రాజాం, గుంతకల్లు మున్సిపాల్టీలను బీసీ మహిళకు ఇచ్చారు. కర్నూలు జిల్లాలోని గూడూరుతో పాటు నందికొట్కూరు, ముమ్మిడివరం, ఆళ్లగడ్డ, సాలూరు, ఇచ్ఛాపురం, నర్సీపట్నం, ఎర్రగుంట్ల, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలను కూడా బీసీ మహిళకే కేటాయించారు.

# రోగులకు మందుల విక్రయంపై 50% డిస్కౌంట్

- **కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఎల్ఎల్ ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో మందుల విక్రయం**
- **11 ఏళ్లుగా అమృత్ పథకం కింద దేశ వ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో హెచ్ఎల్ఎల్ సేవలు**
- **రూ.18,000 కోట్లకు పైగా మందుల విక్రయాలు**
- **ఎంఆర్‌పిపై 50 శాతం వరకు తగ్గింపు ధరలతో రోగులకు మందుల లభ్యత**
- **హెచ్ఎల్ఎల్ రంగ ప్రవేశానికి మంత్రి ఆమోదం**



**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన హెచ్ఎల్ఎల్ లైఫ్ కేర్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో రోగుల ప్రయోజనార్థం మందులను విక్రయించేందుకు రాష్ట్రవైద్యారోగ్య శాఖ నిర్ణయించింది. కేంద్ర ఆరోగ్య శాఖ నియంత్రణలో పనిచేసే హెచ్ఎల్ఎల్ అమృత్ ( ఎఫర్డబుల్ మెడిసిన్స్ అండ్ రిలయబుల్ ఇంప్లాంట్స్ ఫర్ ట్రీట్‌మెంట్–ఞావీ=ఖు ) పథకం కింద మందుల సరఫరా 2015 నుంచి చేస్తోంది. హెచ్ఎల్ఎల్ ద్వారా ఇప్పటి వరకు రూ. 18,341 కోట్ల విలువ మేరకు ప్రభుత్వాసుపత్రుల్లో దేశవ్యాప్తంగా మందులు మరియు సర్జికల్స్‌ల విక్రయాలు జరిగాయి. ఎంఆర్‌పిలో 50 శాతం వరకు తగ్గింపు ధరలతో చేస్తున్న హెచ్ఎల్ఎల్ విక్రయాల ద్వారా రోగులకు దాదాపు రూ. 9,000 కోట్లు ఆదా అయినట్లు సమాచారం.

**కేంద్రం సూచన**

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఎల్ఎల్ సేవలను రాష్ట్రంలో వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రానికి సూచించింది. ఈ నేపథ్యంలో హెచ్ఎల్ఎల్ ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించిన అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రుల్లో మందుల విక్రయానికి హెచ్ఎల్ఎల్ రంగ ప్రవేశానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. డిఎంఈ అధీనంలో నడిచే 17 బోధానాసుపత్రులు, డియస్‌హెచ్ అధీనంలో నడిచే 8 జిల్లా ఆసుపత్రుల్లో హెచ్ఎల్ఎల్ త్వరలో మందుల విక్రయాలను ప్రారంభించే అవకాశం ఉంది.

ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రుల్లో మొత్తం 712 రకాల మందులు, 377 సర్జికల్ సంబంధిత వస్తువులను ప్రభుత్వం రోగులకు ఉచితంగా అందిస్తోంది. వీటిలో 80 శాతాన్ని కేంద్రీకృత కొనుగోలు ద్వారాను, 20 శాతాన్ని ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్ల ద్వారా వికేంద్రికృత విధానంలో కొనుగోలు చేస్తున్నారు. పలు కారణాల వలన 150కి పైగా మందుల లభ్యతలో తరచుగా సమస్యలు ఎదురవుతున్నాయి. వికేంద్రీకృత కొనుగోలులో ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రుల్లో మందుల విక్రయంలో హెచ్ఎల్ఎల్ ప్రవేశం ద్వారా రోగులకు, ఆసుపత్రుల్లో కూడా ప్రయోజనం ఉంటుందని ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. సాలీనా మందుల కొనుగోలుకు రూ. 600 కోట్లు, సర్జికల్స్ కొనుగోలుకు రూ. 200 కోట్లు బడ్జెట్ కేటాయిస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మందుల విక్రయాలకు అవసరమైన దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన ఖర్చును హెచ్ఎల్ఎల్ భరిస్తుంది. ప్రభుత్వాసుపత్రులపై ఎటువంటి అదనపు భారం ఉండదు.

# ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ పురస్కారం



(మొదటి పేజీ తరువాయి)

'స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు' అంశంపై రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లు చేసిన కృషికి గాను ఈ అవార్డును ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

కాలిఫోర్నియాకు చెందిన రాబర్ట్ ఇ. హాల్ 1967లో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)లో పిహెచ్‌డి పూర్తి చేశారు. ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మసాచుసెట్స్‌కు చెందిన వుడ్‌ఫోర్డ్ సైతం ఎమ్ఐటి నుంచి 1983లో పిహెచ్‌డి పూర్తి చేశారు. కొలంబియా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఈ ఇద్దరు అభివృద్ధి చేసిన కొత్త ఆర్థిక నమూనాల ఆధారంగా సరైన సమయంలో తీసుకునే ఆర్థిక, ద్రవ్య విధాన చర్యలు ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులను తగ్గించగలవని నిరూపితమయ్యాయి. గత సోమవారం వైద్య రంగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన నేటితో ముగిసింది.

# కారులో సజీవ దహనం



**విజయవాడ, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలో ఘోర ప్రమాదం జరిగింది. స్థానిక బైపాస్ రోడ్డులో కారు రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. స్థానికులు వెంటనే స్పందించి.. పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పారు.

ఈ ప్రమాదంలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుపత్రికి పోలీసులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు గుంటూరు జిల్లా నంబూరు, విజయవాడ సమీపంలోని నున్న వాసులని పోలీసులు వివరించారు. మృతులు రాందేవ్, అరుణ, విజయతోపాటు చిన్నారిగా గుర్తించామని అన్నారు. నంబూరులో ఓ ఫంక్షన్‌లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

**ప్రమాదం తీవ్రంగా కలచివేసింది: మంత్రి లోకేశ్**

ఈ ప్రమాద ఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. 'విజయవాడ వెస్ట్ బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు సజీవదహనం కావడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

## ఐఏఎస్‌ల బదిలీలు.. పోస్టింగ్‌లు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులకు కొత్త పోస్టింగ్‌లు కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నుంచి అధికారికంగా సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వం మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించగా, వారిలో 9 మందికి కొత్తగా పోస్టింగ్‌లు, ఇద్దరికి పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు.

నూతన నియమకాల వివరాల ప్రకారం.. 2002 బ్యాచ్‌కు చెందిన సౌరభ్ గౌర్ న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ఓఎస్‌డీగా నియమితులయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా డి. మురళీధర్ రెడ్డి, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శిగా మంజుల బాలాజీ దిగంబర్ పోస్టింగ్ పొందారు. ఇక పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా ఆమ్రపాలి కాటా, యువజన సేవల సంచాలకుడిగా కె. నీలకంఠ రెడ్డి నియమితులయ్యారు.

అలాగే పరిశ్రమలు, వాణిజ్య శాఖ సంయుక్త కార్యదర్శిగా బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్), సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్) బాధ్యతలు చేపట్టనున్నారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ ఉప కార్యదర్శిగా గెడేల శ్రీను కుమార్, ఏపీ పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వర ప్రసాద్‌లను ప్రభుత్వం నియమించింది.

మరోవైపు పూర్తి అదనపు బాధ్యతల విషయానికి వస్తే.. హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకుడిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్ ఏపీ రాష్ట్ర ఆర్థిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ ఉత్తర్వులన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

## రాష్ట్రపతి రాకకు సర్వం సిద్ధం



(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు పటిష్టంగా ఏర్పాటు చేయాలని సిఎస్ ఆదేశించారు.

అంతకు ముందు ఈ వర్చువల్ సమావేశానికి వర్చువల్ గా పాల్గొన్న రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామల రావు మాట్లాడుతూ భారత రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి వివిధ శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీ వివరాలను తెలియజేశారు.

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు సంబంధించి డ్రాఫ్ట్ ముసాయిదా ప్రయాణ సమాచారం ప్రకారం ఈనెల 14వతేదీ మధ్యాహ్నం 3.55 గం.లకు రాష్ట్రపతి ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి సా.6.25 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గంలో విజయవాడ ఇంద్రకీలాద్రికి చేరుకుని రాత్రి 7.20 గం.ల నుండి 7.40 ల వరకు కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాత్రికి విజయవాడలో బస చేస్తారు. 15వతేది ఉదయం 11.30 గం.లకు పున్నమీ ఘాట్ చేరుకుని ఉ.11.30గం.ల నుండి మధ్యాహ్నం 1గం.వరకూ అక్కడ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్ మేళాలో ముఖ్య అతిధిగా పాల్గొంటారు. తదుపరి మధ్యాహ్నం 1గం.10 నిమిషాల నుండి 2గం.ల10 నిమిషాల వరకూ స్వయం సహాయక సంఘాలు-లాక్పతి దిదిలతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రాష్ట్రపతి మధ్యాహ్నం 2.45 గన్నవరం విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయలుదేరి వెళతారు.

ఈవర్చువల్ సమావేశంలో అదనపు డిజిపి మదుసూదన్ రెడ్డి, పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, సెర్ప్ సిఇఓ కరుణ, ఎన్టిఆర్ జిల్లా కలక్టర్ లక్ష్మిషా, ఐఅండ్పిఆర్ డైరెక్టర్ కెఎస్.విశ్వనాధన్, దుర్గగుడి ఇఓ శీనూనాయక్, ప్రోటోకాల్ విభాగం జెస్.రామసుబ్బయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా 'సమావేశి ఆజీవిక యోజన'



(మొదటి పేజీ తరువాయి)

యానాది, చెంచు కులాల జనాభా ఎక్కువగా ఉన్న 26 మండలాల్లోని 650 గ్రామ సంఘాల (వీఓ) ద్వారా 10,000 అతి నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసి... భాగస్వామ్య గ్రామీణ మదింపు (పీఆర్ఏ), గృహ సర్వేల ద్వారా కుటుంబాలను గుర్తిస్తామన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన 'సాయం' యాప్ ద్వారా వల్నరబిలిటీ ఇండెక్స్ (దుర్బలత్వ సూచీ) ఆధారంగా ప్రాధాన్యతా ర్యాంకింగ్ ఇస్తారని మంత్రి పేర్కొన్నారు.

మండల సమాఖ్యలు ఎంపిక చేసే 100 మంది ఉపాధి సఖులు ప్రతి ఒక్కరూ 100 కుటుంబాలకు మార్గదర్శకత్వం వహిస్తూ సహాయపడతారని.. ప్రతి కుటుంబానికి తగిన ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికను సిద్ధం చేస్తారని మంత్రి తెలిపారు. ఇందులో ప్రకృతి వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించి, ఆస్తుల ఏర్పాటు వం-కు ఉపాధి సఖులు తోడ్పాటు అందిస్తారని.. ఈ కార్యక్రమానికి 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్' (క్రిస్ప్) సాంకేతిక సహకారాన్ని అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

ఈ నెల 21న సెర్ప్ కార్యాలయంలో 26 మండల సమాఖ్యల అధ్యక్షులతో సమావేశం, సాయం యాప్‌పై శిక్షణ ఉంటుందని.. అక్టోబర్ 25 - 30 మధ్య గ్రామ సంఘాల ఆధ్వర్యంలో పీఆర్ఏ నిర్వహిస్తూ ఉపాధి సఖులకు శిక్షణ ఇస్తారని మంత్రి తెలిపారు. నవంబర్ 1 - 15 తేదీల మధ్యలో గృహ సర్వే నిర్వహణ, 16న అత్యంత నిరుపేద కుటుంబాల తుది జాబితా ప్రకటన తర్వాత డిసెంబర్‌లో కుటుంబాల వారీగా జీవనోపాధుల గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే జనవరి నుంచి బ్యాంకు అనుసంధానం, జీవనోపాధి ఆస్తుల ఏర్పాటు ప్రక్రియ మొదలవుతుందన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, "అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వరుసలో ఉన్న కుటుంబం వరకు అందాలన్నదే గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వ లక్ష్యం" అని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలు వెనుకపడకుండా స్వయం సహాయక సంఘాల మహిళల సామర్థ్యాన్ని ఉపయోగించుకుని ఈ పథకాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు.

# ఏపీ.. పెట్టుబడుల స్వర్గధామం

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నం తర్వాత రాష్ట్రంలో రెండో ప్రాంతీయ సదస్సుకు కాకినాడ వేదిక కావడం గొప్ప మైలురాయి. కాకినాడ పారిశ్రామిక ప్రగతి చరిత్రలో రూ.6,347 కోట్ల పెట్టుబడులు రావడం కొత్త అవకాశాలకు పునాది వేస్తుంది. ఈ ప్రాంతం మరింత పురోగతి చెందడానికి ఇది ఇంధనంగా పనిచేస్తుంది.

**18 వేల మందికి ఉపాధి :** 16 ఎంఓయూల ద్వారా రూ.4,652 కోట్ల పెట్టుబడులు, రూ.2,090 కోట్లతో పూర్తయిన 4 ప్రత్యేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరగడం శుభసూచకం. ఈ ప్రాజెక్టుల ద్వారా కాకినాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో 18 వేల మందికి ఉపాధి లభించనుంది. ఇది యువతకు ఉపాధి భరోసాను ఇవ్వడంతోపాటు ఎన్నో కుటుంబాలకు ఓ ఆసరాను చూపించే గొప్ప కార్యక్రమంగా నిలిచిపోతుంది.



**సింగపూర్ ఎదిగిన క్రమం మనకు స్ఫూర్తి :** 1965 ప్రాంతంలో సింగపూర్ అనే దేశం అత్యంత పేద దేశం. కనీస అవసరాలు తీర్చుకోవడానికి, దేశం ముందుకు వెళ్లడానికి సరైన అవకాశాలు లేని స్థితి నుంచి తన అభివృద్ధి ప్రయాణాన్ని మొదలుపెట్టింది. ఒక్కో ఇటుక పేర్చుకుంటూ సంకల్ప బలంతో, సమష్టి కృషితో ఈనాటి ప్రపంచంలో అద్భుతమైన దేశంగా మారింది. స్విట్జర్లాండ్ దేశ నమూనా కూడా అలాంటిదే. మనలో స్పష్టత, ఐక్యత, జాతీయత ఉంటే కచ్చితంగా దేశాన్ని పురోగమన దిశగా ముందుకు తీసుకెళ్లవచ్చు.

పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకరించేందుకు, వారిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. వారికి తగిన ప్రోత్సాహకాలు, అనుమతులు త్వరితగతిన ఇస్తున్నాం. పారిశ్రామికవేత్తలు కూడా అదే నిబద్ధతతో, పర్యావరణ హితంగా యువతకు మెరుగైన ఉపాధి చూపుతూ రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి.

**జంషెడ్జీ టాటా దేశాన్ని ముందుకు నడిపారు :** పారిశ్రామికవేత్తలు కేవలం లాభం లెక్కలు మాత్రమే వేయకుండా మనతో పాటు దేశం, జాతిని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పం చేసుకోవాలి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ ద్వారా సమాజానికి మేలు చేయాలనే ఆలోచన ఎల్లవేళలా ఉండాలి. భారతదేశ అభివృద్ధికి జంషెడ్జీ టాటా చేసిన ఎన్నో కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆయన కేవలం పరిశ్రమలంటే లాభాలు ఆర్జించే మార్గాలుగానే కాకుండా, జాతిని ముందుకు నడిపించే ఇంధనాలుగా భావించారు. ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహించారు. అలాంటి వారు మనకు ఎల్లవేళలా స్ఫూర్తిగా నిలుస్తారు.

పెట్టుబడుల రాక, పరిశ్రమల స్థాపన అనేది కేవలం లెక్కల కింద, పారిశ్రామిక ప్రగతి కింద మాత్రమే చూడకూడదు. ఇది వేలాది కుటుంబాల జీవనశైలిని మార్చబోయే భరోసాగా భావించాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 2024, జూన్ నుంచి రాష్ట్రానికి 714 ప్రాజెక్టుల రూపంలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వ అనుమతులు పూర్తికాగా, రూ.4.7 లక్షల కోట్ల ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యాయి. వీటి వల్ల రాష్ట్రంలో 7.1 లక్షల ఉద్యోగాలు యువతకు రానున్నాయి.

**తీర ప్రాంతం రాష్ట్రానికి వరం :** రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం అంటే కేవలం ఒప్పందాలు కుదుర్చుకోవడం మాత్రమే కాదు.. వాటిని పూర్తిస్థాయిలో ప్రారంభించేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. ప్రాజెక్టుల రాకకు, పెట్టుబడుల విస్తరణకు, ప్రారంభానికి అన్ని రకాల అనుమతులను పారదర్శకంగా, వేగంగా ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను చక్కగా నిర్వహిస్తోంది. దీనివల్లనే దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు ప్యారడైజ్‌గా మారింది.

కాకినాడ పేరు చెప్పగానే శ్రమజీవుల వేదికగా గుర్తుకొస్తుంది. కార్మికులు, కర్షకులు, మత్స్యకారులు, వేతన జీవులు అధికం. అవకాశం అందిపుచ్చుకునే యువత ఉన్నారు. మార్పును అందిపుచ్చుకునే సామర్థ్యం కాకినాడకు ఉంది. మారిటైమ్ బోర్డు పరిశ్రమలు, నౌక నిర్మాణ పరిశ్రమలు, గ్రీన్ హైడ్రోజన్, రసాయన, ఆహార శుద్ధి, ఆక్వా ఉత్పత్తుల పరిశ్రమలు రాబోతున్నాయి. వచ్చే పరిశ్రమలన్నీ ప్రపంచంతో అనుసంధానమై, ఇక్కడి ఉత్పత్తులను ప్రపంచమంతా తీసుకెళ్లే అవకాశం ఉన్నవి.

ఆంధ్రప్రదేశ్‌కు 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఓ వరం. దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సుస్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, తీరం రక్షణ అంతే ప్రధానం. దీనికి పరిశ్రమలు తగిన విధంగా సహకరించాలి. గ్రేట్ గ్రీన్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. పచ్చదనం పెంపు, పర్యావరణహితమైన పారిశ్రామిక అభివృద్ధి రాష్ట్రానికి ప్రధానం. తీర ప్రాంత రక్షణ, అక్కడ జీవుల మనుగడ, అభివృద్ధిపై ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది.

**పల్లెల వైపు పెట్టుబడులు రావాలి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పల్లెలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సౌకర్యాల పెంపు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలో పల్లె పండుగ, అడవితల్లి బాట పేరుతో చేస్తున్న కార్యక్రమాలు గ్రామాలు, గిరిజన ఆవాసాలకు సౌకర్యాలను తీసుకొస్తున్నాయి. రూ.1.70 లక్షల కోట్లతో పల్లెలు, ఏజెన్సీల్లో ముమ్మరంగా రోడ్లు, డ్రైన్లు, అనుసంధాన దారులు, ఇతర సౌకర్యాలను పెంచే కార్యక్రమం చేస్తున్నాం. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో కూడా తమ దృష్టి నిలిపి, పరిధిని విస్తరించాలని కోరుతున్నాను. దీనిద్వారా అన్ని ప్రాంతాలకు అభివృద్ధి విస్తరించడం సులభం అవుతుంది. తద్వారా గ్రామాలకు కొత్త అవకాశాలను సృష్టించడం సులభం అవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో నూతన పరిశ్రమలకు పెట్టుబడులు పెట్టేముందు పారిశ్రామికవేత్తలు భూమి గురించో, సౌకర్యాల కల్పన, అనుమతుల గురించో కాదు.. సుస్థిరమైన, సమర్థవంతమైన పాలనను చూస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రభుత్వం మీద నమ్మకంతో వారు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఎక్కడైతే ప్రశాంతమైన పరిస్థితులు, వృద్ధి చెందడానికి అవకాశాలు ఉంటాయో అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారు. అలాంటి పరిస్థితి రాష్ట్రంలో ఉంది.

గత ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి రాకపోగా, ఉన్న పరిశ్రమలు వేరే రాష్ట్రాలకు తరలిపోయాయి. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుస్థిరమైన ప్రగతిని సాధిస్తూ, యువతకు ఉపాధిని చూపుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. పారిశ్రామిక ప్రగతి, పర్యావరణ అభివృద్ధి అనేవి జోడెడ్లుగా ముందుకు సాగితేనే రాష్ట్రం అన్ని విధాలుగా నూతన కళను సంతరించుకుంటుంది.

**రండి.. రాష్ట్ర ప్రగతిలో భాగం పంచుకోండి :** రాష్ట్రంలోకి ఎంతో ఉత్సాహంతో వస్తున్న పెట్టుబడిదారులకు నేను చెప్పేది ఒకటే. రండి.. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో మాతో కలిసి నడవండి.. ప్రజల ఉన్నతి కోసం పనిచేయండి. స్థానిక పెట్టుబడులతో యువతకు ఉపాధి నైపుణ్యాలను కల్పించి ఉద్యోగాలు వస్తాయి. వ్యాపారులకు వ్యాపారం జరుగుతుంది. గ్రామీణులు, మత్స్యకారులతోనూ పనిచేసే అవకాశం ఉంటుంది.

పెట్టుబడులు పెడుతున్న మొదటిరోజు నుంచే పర్యావరణహితమైన పారిశ్రామిక అభివృద్ధి అనే కోణంలోనే ముందడుగు వేయండి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి రంగం అభివృద్ధి చెందేలా, ప్రతి వర్గం ఉన్నతి సాధించేలా ఓ సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. దీనిలో భాగస్వామ్యం అవుతున్న ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, సానా సతీష్ బాబు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## లూకాస్ టీవీఎస్ చెన్నైతో ఎన్‌ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఒప్పందం

- **పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధానంతో విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు**




**మేడికొండూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ )::** మేడికొండూరు సమీపంలోని ఎన్‌ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ప్రముఖ ఆటోమొబైల్ విడిభాగాల తయారీ సంస్థ లూకాస్ టీవీఎస్, చెన్నైతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని కళాశాల యాజమాన్యం తెలిపింది.

ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి, ఆచరణాత్మక పరిజ్ఞానం పొందే అవకాశాలు లభించనున్నాయి. విద్యాభ్యాసంతో పాటు పారిశ్రామిక రంగంలో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్యార్థులు మెరుగైన ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఇది దోహదపడనుంది.

కళాశాల ప్రిన్సిపాల్ డి. సంజయ్ మాట్లాడుతూ పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యం విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో కీలకమన్నారు. నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని తెలిపారు.

డిప్లొమా విభాగం వైస్ ప్రిన్సిపాల్ పి. మనోహర్ మాట్లాడుతూ పరిశ్రమలతో ఇటువంటి ఒప్పందాలు విద్యార్థులకు సాంకేతిక, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు మెరుగైన ఉద్యోగావకాశాలు పొందేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎంబీఏ విభాగాధిపతి రెహమాన్ మాట్లాడుతూ వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపారు.

ఈ ఒప్పందం ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను తీర్చిదిద్దేందుకు ఎన్‌ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి మరింత అవకాశం ఏర్పడిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ, నియామకాల విభాగం ప్రతినిధులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై స్వతంత్ర విచారణ జరపాలి

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నిర్ణయాలు ఎలా తీసుకున్నారు? అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధించి ఎలాంటి విధానాలు అనుసరించారు? ఎన్నికల సంఘం నిర్ణయాల వెనుక ఉన్న పూర్తి వివరాలను పరిశీలించేందుకు స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ ఇండియా బ్లాక్ నాయకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల సంఘం అంతర్గత రికార్డులను కోర్టు తెప్పించుకోవడంతోపాటు, ఓటర్ల తొలగింపులపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని కోరారు. సోమవారం సుప్రీంకోర్టులో ఇండియా బ్లాక్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై మధ్యంతరంగా నిలుపుదల విధించాలని కూడా విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే (కాంగ్రెస్), సౌగతా రాయ్ (టిఎంసి), అఖిలేష్ యాదవ్ (సమాజ్ వాదీ పార్టీ), తేజస్వి ప్రసాద్ యాదవ్ (ఆర్‌జెడి), సంజయ్ రౌత్ (శివసేన), ఎంఎ బేబీ (సిపిఎం), డి. రాజా (సిపిఐ), సుప్రీయా సూలే (ఎన్‌సిపి), మహువా మొయిత్రా (జెఎంఎం), మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్)లు పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు పారదర్శకంగా, చట్టబద్ధంగా తీసుకున్నారా లేదా అన్నది తేల్చాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇతర ఎన్నికల కమిషనర్లకు తెలియకుండా, వారి ఆమోదం లేకుండా సంఘం సమిష్టి అధికారాలను వినియోగించుకున్నారనే ఆరోపణలను పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ అంశాలపై సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.



ఎస్ఐఆర్, ప్రధాన ఎన్నికల కమిషనర్ పనితీరుపై దాఖలైన సంబంధిత పిటిషన్లను సుప్రీంకోర్టు నేడు (మంగళవారం) విచారణకు వచ్చే అవకాశం ఉంది. అంతకు సుప్రీంకోర్టుకు "మార్చ్ ఫర్ డెమోక్రసీ " పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. అయితే బగవాన్ దాస్ రోడ్డు కూడలిలో పోలీసులు భారీకేడ్లు అడ్డుపెట్టి యాత్రను నిలిపేశారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. అయితే, కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే సుప్రీం కోర్టుకు చేరుకుని పిటిషన్ దాఖలు చేశారు. ఈ యాత్రలో భారీ స్థాయిలో ఇండియా బ్లాక్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లు, సమావేశాల మినిట్స్, అధికారుల నోటింగ్స్, ఎన్నికల కమిషనర్లు నమోదు చేసిన అభ్యంతరాలను కోర్టుకు సమర్పించేలా ఆదేశించాలని పిటిషనర్లు కోరారు. ఇసి డిజిటల్ వ్యవస్థలైన ఇసిఐనెట్, ఇఆర్ఓనెట్ యాక్సెస్ లాగ్‌లను కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. 2025 జూన్ 24న దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టాలని తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన పూర్తి ఫైల్‌ను సమర్పించాలని కోరారు. ఆ నిర్ణయం రాజ్యాంగంలోని 324వ అధికరణ, 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలోని 18వ సెక్షన్‌కు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా తీసుకున్న నిర్ణయాలుంటే వాటిని రద్దు చేయాలని కోరారు.

ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన పేర్లపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన వారి పేర్లు, తొలగింపునకు కారణాలు, వయసు, లింగం తదితర వివరాలను పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచురించాలని కోరారు. అర్హులైన ఓటర్లు తిరిగి తమ పేర్లను నమోదు చేసుకునేందుకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. నోటీసు ఇవ్వకుండా, సంబంధిత వ్యక్తుల వాదనలు వినకుండా ఏ ఒక్కరి పేరునూ ఓటర్ల జాబితా నుంచి తొలగించరాదని ఆదేశించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను దేశవ్యాప్తంగా తాత్కాలికంగా నిలిపివేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.

కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఉపయోగించే ఫారం-6లో ఎన్నికల సంఘం చేసిన మార్పులనూ పిటిషనర్లు ప్రశ్నించారు. దరఖాస్తుదారుడు లేదా వారి తల్లిదండ్రులు, తాతముత్తాతల పేర్లు గతంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలో ఉన్నాయా లేదా అనే అదనపు ప్రకటనను ఫారంలో చేర్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనలను సవరించకుండా ఫారంలో మార్పులు చేయడం చట్టబద్ధమేనా అనే అంశాన్ని పరిశీలించాలని కోరారు. సంబంధిత నిబంధనలను సవరించే వరకు ఆన్‌లైన్ ఫారం-6ను ప్రస్తుత చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

## తెనాలిలో మినీ ఫంక్షన్ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి,అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** పట్టణంలోని అలంకార్ థియేటర్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన నల్లాస్ మినీ ఫంక్షన్ హాల్, గెస్ట్ హౌస్‌ను మాజీ మంత్రి, టీడీపీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌ను పరిశీలించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వివాహాలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు నిర్వహించుకునేందుకు మినీ ఫంక్షన్ హాళ్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యవంతమైన వసతులు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, సౌకర్యాలు అందుబాటులోకి రావడం అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు. నల్లాస్ మినీ ఫంక్షన్ హాల్, గెస్ట్ హౌస్ సేవలను తెనాలి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలు రూ.6.92 లక్షల విరాళం



**గుంటూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్):** సాయుధ దళాల పతాక దినోత్సవంకు మహిళా సంఘాలు రూ.6.92 లక్షల విరాళంగా అందించి ఆదర్శంగా నిలిచాయి. ఈ మొత్తం చెక్కును సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ కు డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికులు, యుద్ధంలో గాయపడిన సైనికులు, అమర జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం మహిళా సంఘాల సభ్యులు అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు పతాక చిహ్నాలను స్వీకరించి విరాళాలు అందించి సైనికుల సంక్షేమ కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందజేయాలని కోరారు. దేశ రక్షణలో సైనికులు చేస్తున్న త్యాగాలను స్మరించుకోవడం, వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఎక్కువ మొత్తం విరాళంగా సేకరించిన ఏ పి ఎం లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి ఆర్ గుణశీల, డి.ఆర్.డి.ఏ ఏ.పీ.ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ పెట్రోల్ విధానంపై పునరాలచిన చేయాలి..

- ప్రొఫెసర్ నాగేశ్వర్




**మిర్యాలగూడ అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** వ్యవసాయ రంగంపై ప్రభావాలను సమీక్షించాలి. రైతుల ఆదాయం, ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలిని సెమినార్లో ప్రొఫెసర్ నాగేశ్వర్ నవతెలంగాణ మిర్యాలగూడ టౌన్ పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపి వినియోగించే విధానంపై కేంద్ర ప్రభుత్వానికి ముందు చూపు లేకనే ఆహార భద్రత విధానంలో ప్రతిష్టంబన ఏర్పడిందని దీనిపై కేంద్ర ప్రభుత్వంపునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక అను ధి తి ఫంక్షన్ హాల్ లో రైతు సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన భారత దేశంలో ఆహార భద్రతపై ఇథనాల్ విధాన ప్రభావం అనే అంశంపై జరిగిన సెమినార్లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇథనాల్ వినియోగం ద్వారా ముడి చమురు దిగుమతులను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం వంటి లక్ష్యాలు ఉన్నప్పటికీ, ఈ విధానం వల్ల రైతులకు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌కు, ఆహార భద్రతకు కలిగే ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తే ఇథనాల్‌కు పెరుగుతున్న డిమాండ్ ఈ పంటలను సాగు చేసే రైతులకు అదనపు మార్కెట్ అవకాశాలను కల్పించ వచ్చారు . అయితే, ఇథనాల్ ఉత్పత్తి కోసం వ్యవసాయ పంటల వినియోగం పెరిగినప్పుడు ఆహార అవసరాలు, పశుగ్రాస లభ్యత, పంటల ధరలు, సాగునీటి వినియోగంపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాని వివరించారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు సాగు ఖర్చులు తగ్గడం, మార్కెట్‌లో స్థిరమైన డిమాండ్ ఉండటం అత్యంత ముఖ్యమని . ఇథనాల్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు ఎంతవరకు చేరుతున్నాయి? ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు కలిగే లాభనష్టాలు ఏమిటి? పంటల సాగు విస్తీర్ణంలో మార్పులు చోటుచేసుకుంటే ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం పడుతుంది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసర మన్నారు. దేశంలో వ్యవసాయం కోట్లాది కుటుంబాలకు జీవనాధారమని . వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసే ఏ విధానమైనా రైతుల ఆదాయం, ఆహార భద్రత, పర్యావరణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకొని అమలు చేయా లన్నారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం పంటలను వినియోగించే విధానంలో ఆహార అవసరాలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పంటల సాగు, నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. ప్రభుత్వం ఇథనాల్ విధానంపై స్వతంత్ర నిపుణుల కమిటీతో సమగ్ర అధ్యయనం చేయించి, రైతు సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేలా, ఆహార భద్రతకు భంగం కలగకుండా, పర్యావరణానికి మేలు చేసే విధంగా విధానంలో అవసరమైన మార్పులు చేపట్టాలని తెలిపారు. రైతుల సంక్షేమం, దేశ ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని . ఇంధన అవసరాలను తీర్చే ప్రయత్నంలో వ్యవసాయ రంగ ప్రయోజనాలు విస్మరించబడకుండా ఇథనాల్ పెట్రోల్ విధానాన్ని సమీక్షించా లన్నారు. ఎందుకంటే రైతుల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలు!పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం అనేది కేవలం ఇంధనానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని ఇది వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, ఆహార భద్రత, భూగర్భ జలాలు, పర్యావరణం, దేశ ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్న విధాన మని తెలిపారు. ఆహార పంటల నుంచి ఇంధన పంటల వైపు సాగు మళ్లడం, నీటి వనరులపై ఒత్తిడి పెరగడం, పంటల ధరల్లో మార్పులు రావడం వంటి ప్రమాదాలను కూడా విస్మ రించకూడదని చెప్పారు. దేశానికి ఇంధన భద్రత ఎంత ముఖ్యమో, ప్రజలకు ఆహార భద్రత కూడా అంతే ముఖ్యమ ని రైతులకు గిట్టుబాటు ధర, ప్రజలకు సరసమైన ఆహారం, వ్యవ సాయానికి అవసరమైన నీరు, పర్యావరణ పరిరక్షణ – ఈ నాలుగు అంశాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఇథనాల్ విధానం దీర్ఘకాలంలో ప్రయోజనకరంగా మారుతుందని తెలి పారు. రైతు సంఘం జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేనిసు దర్శన్ మాట్లాడుతూ ఇంధన అవసరాల కోసం వ్యవసాయాన్ని ఉపయోగించుకోవచ్చు. కానీ వ్యవసాయాన్ని కేవలం ఇంధన ముడిపదార్థాల సరఫరా రంగంగా మార్చకుండా, రైతుల జీవనోపాధిని మరియు దేశ ఆహార భద్రతను కాపాడటం ప్రభుత్వ విధానంలో ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. నవంబర్ 15 నుండి 18వ తేదీ వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే జాతీయ రైతు సంఘం మహాసభ జగనన్నదని దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు ఆ మహాసభలకు హాజరు కారున్నారని మహాసభలను విజయ వంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ ఆదర్శ రైతు జో నాలగడ్డ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కులను కాలరాయడం మోడీకే చెల్లింది

- ప్రజా రవాణా పై ఆంక్షలు విధించటం సిగ్గు చేటు
- ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ కుమార్‌ను వెంటనే పదవి నుండి తొలగించాలి
- ఎం.సి.పి.ఐ.యు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్



**బెల్లంపల్లి అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం లోని ఏంసిపిఐయూ పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించిన జిల్లా సహాయక కార్యదర్శి పసులేటి వెంకటేష్ రాజ్యాంగ హక్కులను కాలరాయడం ప్రధాని మోడీకే చెల్లిందని మార్క్సిస్టుకమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ దేశ పౌరుడి ఓటు హక్కును కాలరాస్తున్న ఎస్ఐఆర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, ఇందుకు ప్రధాన బాధ్యులైన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిర్వహించతలపెట్టిన ప్రజా ఆందోళన మార్చ్‌లో పాల్గొనేందుకు వస్తున్న ప్రజలపై ముందస్తు నిర్బంధాలు విధించడం, కార్యకర్తలు, నిర్వాహకుల ఇళ్లకు పోలీసులు వెళ్లడం, వివిధ ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలేనని అన్నారు. 250 రైలు సర్వీసులను రద్దు చేయడం, 57 ఢిల్లీ మెట్రో స్టేషన్లను మూసి వేయడం, ఇంటర్నెట్ సేవలను ఆపివేయడం, ఏడు అంచల భారీ బారికేడ్లు ఏర్పాటు చేయడం, వ్యాపార సముదాయాలను మూసివేయించడం వంటి చర్యలు ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు ఆటంకం కలిగిస్తాయన్నారు. ఈ చర్యల వల్ల రైతులు, కార్మికులు, విద్యార్థులలి రోజువారీ కూలీలు, వైద్య చికిత్స కోసం ప్రయాణించే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు భావప్రకటనా స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, దేశంలో స్వేచ్ఛగా సంచరించే హక్కులు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులని ఆయన గుర్తుచేశారు. పరిపాలనాపరమైన ఆంక్షలు చట్టబద్ధంగా ఉండాలని, శాంతియుత ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి అనవసరమైన అడ్డంకులు సృష్టించ కూడదని స్పష్టం చేశారు. శాంతియుత ప్రజా పోరాటాలను అడ్డుకోవడం కాకుండా ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు,ఉద్యమాలను ఎంత అణిచి వేయటానికి ప్రయత్నిస్తే అంత కు ఎక్కువ ఉద్యమాలు ఉధృతం అవుతాయని హెచ్చరిస్తున్నాం అన్నారు.

# పాత కరెన్సీ నోట్ల పేరుతో మోసం..

- అమాయకుల నుండి 70కి పైగా మ్యూల్ ఖాతాలను సేకరించిన ఇద్దరు నిందితుల అరెస్ట్

**హైదరాబాద్, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ అంతటా ప్రసిద్ధి పొందిన ఈ సైబర్ నేరంతో భారతదేశ వ్యాప్తంగా దాదాపు 450 కేసులు నమోదయ్యాయి. ఈ ఫ్రాడ్‌లో సుమారు రూ. 60 నుండి 70 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఫేస్‌బుక్ ద్వారా పాత కరెన్సీ నోట్ల కొనుగోలు పేరిట ఒకే బాధితుడి నుండి రూ. 7,93,351 కాజేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

తేదీ: 08.10.2026 నాడు విశ్వసనీయ సమాచారం మేరకు, సోషల్ మీడియా వేదిక ఫేస్‌బుక్ ద్వారా పాత కరెన్సీ నోట్లను ఇస్తామంటూ సైబర్ మోసానికి పాల్పడి బాధితుడి నుండి రూ. 7,93,351 కాజేసిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్టయిన నిందితుల వివరాలు :** ఏ – 1) గుమ్మ రమేష్ (వయస్సు: 39 సంవత్సరాలు), రామాంతపూర్, హైదరాబాద్. ఏ – 2) ముదాలె అనిల్ (వయస్సు: 19 సంవత్సరాలు), రామాంతపూర్, హైదరాబాద్.

**నిందితుల నేపథ్యం:** ఏ 1 నిందితుడు ఇదివరకు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాలో నివసించేవాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని రామాంతపూర్‌కు నివాసం మార్చాడు. అక్కడ ఒక కారును బాడగకు తీసుకుని రాపిడో, ఉబర్ డ్రైవర్‌గా పనిచేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో అతనికి సైబర్ నేరగాళ్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఆ తర్వాత, అతను పరారీలో ఉన్న ఇతర నిందితులతో కలిసి రామాంతపూర్, పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు, డెలివరీ బాయ్స్, ఇతర వ్యక్తులను కమీషన్ ఆశచూపి దాదాపు 60–70 మంది నుండి వారి బ్యాంక్ ఖాతాలు, సిమ్ కార్డులను సేకరించాడు. ఆ బ్యాంక్ ఖాతాల పాస్‌బుక్‌లు, ఏటీఎం/డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు, సిమ్ కార్డులను సేకరించి, సైబర్ నేరాలకు ఉపయోగించడానికి హర్యానా రాష్ట్రంలోని వ్యక్తులకు కొరియర్ ద్వారా పంపించేవాడు. ఇలా సేకరించిన సిమ్ కార్డులు, బ్యాంక్ ఖాతాల ద్వారా ప్రధాన నిందితులు వందలాది మంది బాధితులను మోసగించి, దాదాపు రూ. 60 – 70 కోట్ల పరిమాణంలో లావాదేవీలు జరిపినట్లు అనుమానిస్తున్నారు. ఇక ఏ 2 నిందితుడు, ఏ 1 ఇచ్చిన కమీషన్ ఆశతో వేర్వేరు బ్యాంకుల్లో మూడు సేవింగ్స్ ఖాతాలను తెరిచి, వాటికి సంబంధించిన వివరాలు, క్రెడెన్షియల్స్‌ను ఏ1కి అందజేశాడు.

**కేసు వివరాలు :** తేదీ 25-09-2026 సాయంత్రం 17:15 గంటలకు బాధితుడి నుండి ఒక ఫిర్యాదు అందింది. పాత ఒక్క రూపాయి నోటుకు ప్రతిఫలంగా రూ. 45,00,000 ఇస్తామని నమ్మించి, కొంతమంది అపరిచిత వ్యక్తులు తన నుండి రూ. 7,93,351 సేకరించి మోసం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ ఫిర్యాదు ఆధారంగా క్రైమ్ నెంబర్ : 646/2026, యూ/ఎస్.ఈ.సి. 66సి, 66 డీ ఐటి యాక్ట్, – సెక్షన్. 318(4), 319(2), 336(3), 340(2) బీ.ఎన్.ఎస్. కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నిందితుల అరెస్ట్ వివరాలు :** 08-10-2026 మధ్యాహ్నం 12:00 గంటలకు, పక్కా సమాచారంతో రామాంతపూర్, అంబర్‌పేట్ వద్ద ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. సురేందర్, వారి సిబ్బంది నిందితులను అదుపులోకి తీసుకుని బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. తమకు వచ్చే ఆదాయం వ్యక్తిగత ఖర్చులకు, ఆర్థిక అవసరాలకు సరిపోకపోవడం వల్ల భారీగా కమీషన్లు వస్తాయనే ఆశతో సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు, సిమ్ కార్డులను అందించినట్లు తెలిపారు.

తాము ఇచ్చే బ్యాంక్ ఖాతాలు, సిమ్ కార్డులు సైబర్ నేరాల కోసం ఉపయోగించబడతాయని తమకు పూర్తి అవగాహన ఉందని, తెలిసినప్పటికీ కమీషన్ల కోసం కావాలనే ఈ నేరానికి సహకరించామని వెల్లడించారు. ఈ అరెస్ట్ సైబర్ క్రైమ్ పీఎస్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆర్.జి. శివ మారుతి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. సురేందర్, టీమ్ 11 సిబ్బందిని అధికారుల బృందం అభినందించింది.

# కుష్ణపల్లి శ్రీనివాస్‌కు పరామర్శ..

- టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి



**మంచిర్యాల అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లోని బెల్లంపల్లి ఇరిగేషన్ శాఖలో లష్కర్ గా విధులు నిర్వహిస్తున్న కుష్ణపల్లి శ్రీనివాస్ కన్నాల గ్రామపంచాయితీ నివాసి అనారోగ్యంతో కరీంనగర్ ప్రతిమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి హాస్పిటల్ కి వెళ్లి పరమర్శించి వారికి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందించి డాక్టర్ తో వారి ఆరోగ్య పరిస్థితిపై చర్చించి వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు, వారితో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

# విమానంలో మంటలు..

- శంషాబాద్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్

**శంషాబాద్ అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీ–చెన్నై విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో శంషాబాద్‌లో విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. అందిన వివరాల ప్రకారం, ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న విమానంలో ఓ ప్రయాణికుడికి చెందిన పవర్ బ్యాంక్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి.

ఈ పరిణామంతో విమానంలో కలకలం రేగింది. పరిస్థితిని గుర్తించిన విమాన సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. విమానంలో చోటుచేసుకున్న ఈ ఘటన నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా దించినట్లు సమాచారం. విమాన సిబ్బంది సకాలంలో స్పందించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు తెలుస్తోంది. విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం.

**విమానాల్లో పవర్ బ్యాంకుల విషయంలో జాగ్రత్తలు..**

లిథియం బ్యాటరీలు అధికంగా వేడెక్కడం, దెబ్బతినడం లేదా లోపాలు ఏర్పడటం వల్ల మంటలు చెలరేగే ప్రమాదం ఉంటుంది. గతంలోనూ విమానాల్లో పవర్ బ్యాంకుల కారణంగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

విమానాల్లో పవర్ బ్యాంకులతో మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేయడాన్ని నిషేధిస్తూ డీజీసీఏ 2025 నవంబర్‌లో విమానయాన సంస్థలకు సూచనలు జారీ చేసింది.ప్రయాణికులు విమానయాన సంస్థల బ్యాటరీ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. పవర్ బ్యాంక్ దెబ్బతిన్నట్లుగా కనిపించినా, అసాధారణంగా వేడెక్కినా దాన్ని ఉపయోగించకూడదు.

# సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ..

- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..



**శంషాబాద్ అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 119 వ డివిజన్ అధ్యక్షుడు కోలన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ అని మహిళలు భక్తిశ్రద్ధలతో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయక పాటలతో ఆడుతున్న ఉత్సవాలలో కాసేపు గడిపారు. అనంతరం ప్రజలందరికీ బతుకమ్మ మరియు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, మురళీధర్ రెడ్డి, శ్రీనివాస్, సునీత మహేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, శేఖర్, దీప మల్లేష్, రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్, రాజేందర్, మహిళలు, స్థానికులు, పాల్గొన్నారు.

# తీరొక్క పూలతొమొదలైన ఎంగిలిపూల బతుకమ్మ పండుగ



**వలిగొండ అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రాంతంలో మహిళల అత్యంత పవిత్రమైన బతుకమ్మలతో సంబరాలు ప్రారంభం అయ్యాయి పూల ను మహిళలు సాధ్యమైనంత వరకు సమకూర్చి పట్టణంలో వివిధ గ్రామాల్లో మహిళలు బతుకమ్మ పండుగను నిర్వహించారు ఈ కార్యక్రమంలో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ మహిళలు కలిసికట్టుగా బతుకమ్మ పండుగను నిర్వహించారు.

# తెలంగాణ ఉద్యమానికి అక్షర రూపం..

- సీనియర్ జర్నలిస్టు నగేష్‌కు సన్మానం..



**ఆత్మకూరు (ఎం) అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమంతో పాటు, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రత్యేక కథనాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన సీనియర్ జర్నలిస్టు ఎలిమినేటి నగేష్‌ను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలు, నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ సాధనలో, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో జర్నలి స్టుగా నగేష్ అందించిన సేవలను గుర్తించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఆత్మకూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, మండల సెక్రటరీ జనరల్ మామిడి శ్రీనివాస్ రెడ్డి, గుండాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, బిజ్జాల సోమరాజు గుప్తా పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ జిల్లా డైరెక్టర్ పూర్ణచందర్ రాజుకు సన్మానం..



**ఆత్మకూరు (ఎం) అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇటీవల జరిగిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన నేతాజీ యువజన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతికంఠం పూర్ణచందర్ రాజును నేతాజీ యువజన మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన మండలి అధ్యక్షుడు దొంతరబోయిన మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి యాస మహేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ప్రతికంఠం శంతన్ రాజ్, సభ్యులు గట్టు విశాల్, యాస సుభాష్ రెడ్డి, కోల అఖిల్, గుండెగాని వినయ్, మాద నరేష్, కందడి మధు, కట్టెకోల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాన్సిరాం స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం..!

- బోడుప్పల్‌లో 399వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల
- కాన్సిరాం వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన సంఘ సభ్యులు
- అక్టోబర్ 25న బహిరంగ సభను జయప్రదం చేయండి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య



**మేడిపల్లి అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 10లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 399వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ సంఘసంస్కర్త, రాజకీయవేత్త కాన్సిరాం వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ వెనుకబడిన కులాల అభివృద్ధి కోసం, బహుజనుల అభ్యున్నతి కోసం 1984లో బహుజన సమాజ్ పార్టీని స్థాపించి, విద్యా, వ్యాపార ,ఉద్యోగ, రాజకీయ రంగాలలో బహుజనులను చైతన్య పరుస్తూ బహుజన రాజ్యాధికారమే ఏకైక లక్ష్యంగా నిరంతరం కృషిచేసిన కాన్సిరాం జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం అని ఆయన స్ఫూర్తితో బహుజనులు ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని నత్తి మైసయ్య అన్నారు. అదేవిధంగా అక్టోబర్ 25 ఆదివారం 401వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, కుల సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా నత్తి మైసయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గరుగుల యాకయ్య, రాపోలు వెంకటేష్, పత్రికా విలేకరులు జి శ్రీనివాస్ గౌడ్, రాంపల్లి రమేష్ గౌడ్, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు బెక్కం శివ గోపాల్ దాస్ మల్లేష్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎల్‌నినోను కాంగ్రెస్‌కు అంటగట్టడం బీఆర్ఎస్‌కు సరికాదు..
- వాతావరణ పరిస్థితులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి..
- పీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్..

**కడ్తాల్ అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.ఎల్‌నినో అనేది సహజ వాతావరణ పరిణామమని,దాని ప్రభావానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యురాలిగా చేస్తూ బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదని అన్నారు.ప్రకృతి పరిణామాలను సైతం రాజకీయాలకు ముడిపెట్టడం సరైన విధానం కాదని హితవు పలికారు.రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్‌తో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శి చేగురి వెంకటేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తత అవసరం..** ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, ఫలితంగా వర్షపాతంలో మార్పులు చోటుచేసుకోవచ్చని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.వర్షాలు సకాలంలో కురవకపోతే వ్యవసాయ రంగంతో పాటు జలవనరులపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయ పనుల విషయంలో తగిన ప్రణాళికతో ముందుకు సాగాలని కోరారు.



**రైతు భరోసాతో పెట్టుబడి సాయం..** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధా న్యతనిస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.రైతు భరోసా పథకం కింద ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోందని, అర్హులైన రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేసిందని పేర్కొన్నారు.పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, సన్న వడ్లకు బోనస్,వ్యవసాయానికి ఉచిత విద్యుత్,రైతు బీమా వంటి చర్యల ద్వారా రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.

**పదేళ్ల పాలనపై బీఆర్ఎస్‌కు ప్రశ్నలు..** రైతుల సమస్యలపై ప్రస్తుతం విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు,గత పదేళ్ల పాలనలో రైతులకు అందించిన సహాయం,పంట నష్టాల సమయంలో తీసుకున్న చర్యలు,పరిష్కరించని సమస్యలపై ప్రజలకు సమాధానం చెప్పాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.తమ పాలనలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులపై సమీక్షించకుండా, ఇప్పుడు రైతుల సమస్యలను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం తగదని వ్యాఖ్యానించారు.ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులకు నష్టాలు ఎదురైనప్పుడు వారికి ఏ మేరకు పరిహారం అందించారో వివరించాలని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే గత పాలనలో చేపట్టిన చర్యలు, సాధించిన ఫలితాలపై ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు.

**రాజకీయ విమర్శల కంటే రైతులకు అండగా నిలవాలి..** ఎల్‌నినో వంటి సహజ వాతావరణ పరిణామాలకు ఒక ప్రభుత్వాన్ని నిందించడం కంటే,వాటి ప్రభావం వల్ల రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరగాలని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.రైతుల్లో ఆందోళన కలిగించేలా రాజకీయ ఆరోపణలు చేయడం మానుకుని, వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు,సహకారం అందించడంపై దృష్టి సారించాలని సూచించారు. రైతులు, ప్రజలు వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు బిచ్యా నాయక్, నాయకులు జగన్ గౌడ్, జవహర్ లాల్ నాయక్, రాజు గౌడ్, రవీందర్, వార్డు సభ్యుడు విజయ్ రాథోడ్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, ప్రవీణ్ గౌడ్, గంజి చంద్రశేఖర్, మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లంటే రేవంత్ రెడ్డికి ఎందుకంత భయం..

- పోలీస్ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు..
- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టైగర్ కృష్ణయ్య డిమాండ్..

**వికారాబాద్ అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** శాంతియుతంగా ఆశా వర్కర్ల జిల్లా మహాసభలు నిర్వహించుకుంటామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు సృష్టిస్తోందని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టైగర్ కృష్ణయ్య ప్రశ్నించారు. పోలీసుల అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని ఆయన హెచ్చరించారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా మహాసభలకు ఒక రోజు ముందుగానే బీఆర్‌టీయూ జిల్లా నాయకులు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు, ఆశా కార్యకర్తలను అర్ధరాత్రి వేళల్లో వారి ఇళ్లలోకి వెళ్లి బలవంతంగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించడం, నిర్బంధించడం ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశారు. కొడంగల్‌లో ఆశా వర్కర్లు సమావేశం నిర్వహించకూడదంటూ పోలీసులు ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఎన్ని రోజులు అరెస్టులు, నిర్బంధాలతో పాలన సాగిస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. ఆశా వర్కర్లంటే ప్రభుత్వానికి భయముంటే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించడం, ఉద్యోగ భద్రత కల్పించడం, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయడం వంటి హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో అరెస్టు చేసి నిర్బంధించిన ఆశా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని కృష్ణయ్య కోరారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకుండా ఉద్యమాలను అణచివేయాలని చూస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వికారాబాద్‌లో అరెస్టయిన వారిలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశ కార్యకర్తల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అనిత, స్వరూప, రజిత ఉన్నారని తెలిపారు.



# కండ్లకోయలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- రాజకీయాలకు అతీతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు...

**మేడ్చల్, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవీ శరన్నవరాత్రుల ప్రారంభోత్సవం సందర్భంగా 299వ డివిజన్ పరిధిలోని కండ్లకోయ పట్టణంలో ఆదివారం అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కులాలకు, రాజకీయాలకు అతీతంగా కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేందర్ ముదిరాజ్ ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం కార్యక్రమంలో ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, 299వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జగన్ రెడ్డి, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్, 299వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్, 299వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాకర బోయిన మల్లేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం పెద్దలు టి. పెంటేష్ ముదిరాజ్, రామకృష్ణ, బిక్షపతి, మల్లేష్, గౌడ్ యాదయ్య, టి.శ్రీనివాస్ ముదిరాజ్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు వై. రాజు, శ్రీకాంత్ ముదిరాజ్, శివ ముదిరాజ్‌తో పాటు భవానీ మాలధారులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కేసీఆర్ పాలనలో తెలంగాణకు అభివృద్ధి, సంక్షేమంలో ప్రత్యేక గుర్తింపు..

- 33 జిల్లాల ఏర్పాటు నుంచి సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం..
- ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్‌దే..
- బీఆర్ఎస్ నాయకుడు గోపాల్..

**వికారాబాద్, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సాధించిన తెలంగాణ జాతిపిత తెలంగాణ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా సంస్కరణలు, సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది వేశాయని వికారాబాద్ పట్టణ మాజీ అధ్యక్షుడు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గోపాల్ అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రజలకు అనుకూలంగా పాలన ఉండేందుకు రాష్ట్రంలో 33 జిల్లాల ఏర్పాటు, సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. వెయ్యి రోజుల సందర్భంగా వికారాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని, 10 జిల్లాలుగా ఉన్న తెలంగాణను 33 జిల్లాలుగా విస్తరించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు, పరిపాలనా సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గతంలో జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ప్రజలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండేదని, కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల అనేక ప్రాంతాల ప్రజలకు పరిపాలనా సౌలభ్యం పెరిగిందని వివరించారు. కొత్త జిల్లాలకు అనుగుణంగా సమీకృత కలెక్టరేట్ భవనాలను నిర్మించడం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చే ప్రయత్నం జరిగిందని చెప్పారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరాన్ని తగ్గించేలా పరిపాలనా వ్యవస్థను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అధికారుల సమన్వయం, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ భవనాలు ఉపయోగపడేలా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. కేవలం పరిపాలనా సంస్కరణలకే పరిమితం కాకుండా పేదలు, రైతులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసిందని గోపాల్ అన్నారు. రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతులకు 24 గంటల కరెంటు, జిల్లాకు ఒక వంద పడకల ఆసుపత్రి, దళిత బంధు, గ్రామాలలో ఇంటింటి మిషన్ భగీరథ నీళ్లు, మిషన్ కాకతీయ, కేసీఆర్ కిట్ వంటి అనేక పథకాల ద్వారా వివిధ వర్గాలకు ఆర్థిక సహాయం అందించే ప్రయత్నం జరిగిందని గుర్తుచేశారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ రైతులకు పెట్టుబడి సాయం అందించడం, రైతు కుటుంబాలకు భరోసా కల్పించడం, పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా గత ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ కోసం అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణ రాజకీయ, పరిపాలనా చరిత్రలో ప్రాధాన్యత కలిగినవని అన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత గతంలో అమలైన పథకాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రజలు ప్రస్తుత ప్రభుత్వ పనితీరును పరిశీలిస్తున్నారని గోపాల్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంతోపాటు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు ఉపయోగపడే పథకాల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు సాగాలని సూచించారు. అభివృద్ధి అనేది కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గతంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు గుర్తిస్తున్నారని, భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని గోపాల్ అభిప్రాయపడ్డారు. వెయ్యి రోజుల సందర్భంగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలు, ప్రస్తుత ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో చర్చ జరుగుతోందని పేర్కొంటూ, తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమమే పాలనకు ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు.



# యాదగిరిగుట్టలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు..

**యాదగిరిగుట్ట, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ శ్రీ శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం 11:00 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనం, పంచగవ్య ప్రాశనం, అఖండ దీపారాధన, అంకురారోపణ, మండపారాధన, కలశ స్థాపన, శ్రీదేవి పూజ తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం బాలాత్రిపుర సుందరీ దేవి పూజతో పాటు మూలమంత్ర జపం, దుర్గా సప్తశతీ పారాయణం, లలితా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భవాని శంకర్, ఏఈఓ సురేందర్ రెడ్డి, శివాలయ ప్రధానార్చకులు నరసింహమూర్తి, అర్చకులు, పలువురు భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.





**సాయంత్రం ప్రత్యేక పూజలు :** ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి నవావరణ పూజ, చతుష్షష్ట్యుపచారయుక్త సహస్రనామార్చన, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, దేవీ త్రికాల పూజలు నిర్వహింపబడ్డాయి.

# యాదగిరిపెల్లి దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు..

- పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి..



**మిర్యాలగూడ అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** మండలం లోని యాదగిరిపెల్లి గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గామాత ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, మిర్యాలగూడ నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గాయం ఉపేందర్రెడ్డి, గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాసరెడ్డి, నాయకులు మహబూబ్ అలీ, సిపిఐ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, సురేషు, శంకర్, గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరి నాగదేవత ఆలయంలో అభివృద్ధి పనులు

- ఈ పుణ్యకార్యంలో పాల్గొనడానికి శ్రీ జయలక్ష్మి అమ్మ సంకల్పం ట్రస్ట్‌ని సంప్రదించవచ్చు..

**హైదరాబాద్, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** సికింద్రాబాద్ తిరుమలగిరిలో నెలకొని ఉన్న స్వయంభు శ్రీ నాగదేవత ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నగరానికే నాగమణిలా ఎన్నో దశాబ్దాలుగా వెలుగుతున్న ఈ ఆలయం యొక్క శక్తి భక్తులకు తెలియంది కాదు. ఎన్నో వేల కుటుంబాలు, లక్షల భక్తుల కోరికలను తీర్చి వారి వారి జీవితాలను నిలబెట్టిన మహా పుణ్యక్షేత్రం ఈ నాగదేవత ఆలయం. మహిళా భక్తులు నాగుల చీర ధరించి ఈ ఆలయానికి రావడం విశేషంగా భావిస్తారు. సాక్షాత్తు నాగదేవత సంపూర్ణ అనుగ్రహం పొందిన జయ లక్ష్మమ్మ, వారి కుటుంబం ఈ ఆలయానికి శక్తి వంచన లేకుండా సేవలందించుకుంటున్నారు. అందులో భాగంగా పది కాలాలపాటు నిలిచిపోయే విధంగా ఈ ఆలయానికి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మహా కుంభాభిషేకం జరగనున్నది. దీనికి సంబంధించి శిల్పకలతో కూడిన గురు స్థానం యొక్క పెయింటింగ్, వాతావరణానికి అనుగుణంగా తట్టుకునే చెత్తు యొక్క మరమ్మత్తు, ప్రస్తుతమున్న శిల్పకళా యొక్క బంధవస్తు, ఫ్లోరింగ్, టైలింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, నీటి వసతి మరెన్నో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఆసక్తి, అవకాశమున్న భక్తులు ఈ పుణ్యకార్యంలో పాలు పంచుకోవడానికి శ్రీ జయలక్ష్మి అమ్మ సంకల్పం ట్రస్ట్‌ని సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలియజేశారు..



# సదాశివపేటలో పోలీసుల వాహన తనిఖీలు ముమ్మరం!

- సీఐ వెంకటేశ్ ఆదేశాలతో తనిఖీలు..
- నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచన

**సదాశివపేట అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సీఐ వెంకటేశ్ ఆదేశాల మేరకు పోలీసులు వాహనాలను ఆపి, అవసరమైన పత్రాలను పరిశీలిస్తూ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసుల చర్యలు.. ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు రహదారులపై క్రమశిక్షణను పెంపొందించేందుకు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఎమ్మార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదరణ విద్యార్థులకు సరుకులు పంపిణీ..



**హైదరాబాద్, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తండ్రి స్వర్గీయ మామిడి రామయ్య 16వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మామిడి రామయ్య ఫౌండేషన్(ఎంఆర్ ఎఫ్) ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని ఆదరణ విద్యార్థుల ఆశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆశ్రమంలో ఉంటూ, చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల కోసం అవసరమైన నిత్యావసర సరుకులను ఫౌండేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆదరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జే. మాధవరావుకు అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, తన తండ్రి స్వర్గీయ మామిడి రామయ్య స్మారకార్థం గత 15 సంవత్సరాలుగా ఎమ్మార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఆయన వర్ధంతి రోజు పేదలకు తనవంతు సహాయం చేయడం జరుగుతుందని అన్నారు. సమాజంలో ఎంతోమంది అనాథ పిల్లలు, వృద్ధులు దిక్కులేని స్థితిలో జీవచ్ఛవాలుగా బతుకు తున్నారని, అలాంటి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అన్నారు. పాతికేళ్ళుగా అనాథ పిల్లలను చేరదీసి విద్యావంతులను చేస్తున్న ఆదరణ సంస్థ నిర్వాహకులు అభినందనీయులని మామిడి సోమయ్య పేర్కొంటూ, ఈ సందర్భంగా ఆదరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జే. మాధవరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అశోక్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవికుమార్, ఎల్బీనగర్ నియోజకవర్గం కోశాధికారి నంబి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# పసల ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

- ప్రారంభించిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్.. - వెల్లడించిన అధినేత విక్రమ్ సాగర్..

**యాదాద్రి భువనగిరి, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** పసల ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఐదు రీజియన్స్‌ల పరిధిలోని 32 జట్ల క్రికెట్ టీంల మధ్య టోర్నమెంట్‌ను శనివారం రోజు ఎమ్మెల్సీ శంకర్ నాయకతో కలసి ప్రారంభించినట్లు సంస్థ అధినేత విక్రమ్ సాగర్ వెల్లడించారు. ఆదివారం రోజు పసల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలను మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. స్పోర్ట్స్ తోపాటు కల్చరల్ యాక్టివిటీస్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వ హిస్తున్నామని అన్నారు. అక్టోబర్ 18న ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు వెల్ల డించిన ఆయన విద్యార్థులకు ఏఐ రోబోటిక్స్, సిఏ ఫౌండేషన్, ఐఏఎస్, ఐపీఎస్‌లకు ట్రైనింగ్ ఇవ్వటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసు లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అందరూ సాధికారత సాధించాలనే ఉద్దేశ్యం తోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ / చైర్మన్ అర్జున్ మదను, సీఈవో గోకుల్ రమణ, కార్యవర్గ సభ్యులు వై రాజా, చిలువేరు శంకర్ తదితరులు పాల్గొన్నారు..



# పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా

- పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.





**నిజామాబాద్,అక్టోబరు12(జర్నలిస్ట్ ఫైల్):** నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 275 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం రూ.2,75,31,900 విలువైన ఆర్థిక సహాయ చెక్కులను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అందజేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. ...రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని,ఆడబిడ్డల వివాహాలు పేద కుటుంబాలకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో షాదీ ముబారక్ పథకం కింద 149 మంది లబ్ధిదారులకు రూ.1,49,17,284, కళ్యాణ లక్ష్మి పథకం కింద 126 మంది లబ్ధిదారులకు రూ.1,26,14,616 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు.ఈ రెండు పథకాల ద్వారా మొత్తం 275 మంది లబ్ధిదారులకు రూ.2,75,31,900 ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టిందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500కే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం,రైతు రుణమాఫీ,రైతు భరోసా,యువతకు ఉపాధి అవకాశాల కల్పన,సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా పేద,మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూడా చైర్మన్ కేశ వేణు, స్థానిక కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలి

- తెలంగాణ సిక్కు సొసైటీ ఆరోగ్య శిబిరంలో ఎమ్మెల్యే ధన్పాల్...



**నిజామాబాద్, అక్టోబరు12 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.తెలంగాణ సిక్కు సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.పేదలైన సిక్కులకు ఇల్లు అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని,పేదలకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని,అందరూ ఐక్యమత్యంతో ఉంటూ ప్రభుత్వ పథకాలు పొందాలన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో తెలంగాణ సిక్కు సొసైటీ అధ్యక్షురాలు తేజ్ దీప్ కౌర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ దర్శన్ సింగ్ సోకి,బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్,పవన్ ముందడ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావం తీవ్రంగా వుంది - రైతులు 2వ పంట వేయవద్దు.

## ప్రభుత్వ రాష్ట్ర ముఖ్య సలహాదారులు,బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి

- రాష్ట్రంలో తాగడానికి నీళ్ళు,కొందామంటే కరెంటు దొరకడం లేదు
- ఈ స్థితిలో యాసంగి పంటలు ఎవరు కూడా వేయవద్దు
- గ్రామ గ్రామాన ప్రత్యేక కమిటీలు ఏర్పాటు
- నీటిని,విద్యుత్‌ను పొదుపుగా వాడుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలి
- పంటలు వేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే



**నిజామాబాద్,అక్టోబరు12(జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావం తీవ్రంగా వుండడం వల్ల వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో వున్న ప్రధాన ప్రాజెక్టులు,రిజర్వాయర్లు,చెరువులు,కుంటల్లో కావల్సినంత నీరు నిల్వలు లేక పోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయాయని రాష్ట్ర ముఖ్య సలహాదారులు బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి తెలిపారు.దీనిపై అవసరమైన కార్యచరణ అమలు చేయడానికి ముఖ్యంగా పంటలు,తాగునీరు,విద్యుత్ వంటి కీలక సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రాష్ట్ర చీఫ్ సెక్రటరీతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారని రాష్ట్ర ముఖ్య సలహాదారులు,బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి తెలిపారు.ఇందులో భాగంగా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా సింగూరు ప్రాజెక్టు కేవలం తాగు నీరు కోసమే ఉపయోగ పడుతుందన్నారు. అలాగే నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో ఆశించిన స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి లేక పోవడం వల్ల రైతులు,ప్రజలు విద్యుత్‌ను సాగునీరు,తాగు నీరును పొదుపుగా వాడుకోవాలని సూచించారు.సింగూరు ప్రాజెక్టు నుండి డిసెంబర్ 2026 వరకే నీరు అందుబాటులో వున్నాయి.సింగూరు ప్రాజెక్టు క్రింద ప్రత్నమ్య మార్గాల ద్వారా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య సలహాదారులు,బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.ఎక్కడ కూడా నీటి సరఫరాలో లీకేజీలు లేకుండా నీరు వృదా కాకుండా అధికారులు వాటిని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు పొదుపుగా వాడుకోవాలని చెప్పారు. ఎలన ీనోతో రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం నెలకొందని ఈ దృష్ట్యా ఈ రబీ సీజన్లో ఎలాంటి పంటలు వేయవద్దని రైతులకు సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎల్‌నీనో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో తాగడానికి నీరు దొరకడం లేదు కొందామన్న విద్యుత్ దొరకడం లేదు ఇలాంటి పరిస్థితుల్లో పంటలు వేస్తే పరిస్థితులు మరి దారుణంగా వుండే ప్రమాదం వుందని సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో అధికారులు ముఖ్యంగా సాగునీటి శాఖ, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ, ఎంపిడీవోలు, ఎంఆర్ఒలు రైతులకు,ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కమిటీలు వేస్తూ గ్రామ పంచాయతీల ద్వారా దండోరా వేయించి అవగాహన కల్పించాలని సుదర్శన్ రెడ్డి కోరారు. ప్రాజెక్టులలో నీరు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోయింది.ప్రస్తుతం పూర్తిగా సోలార్ విద్యుత్ ఉత్పత్తినే వాడుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌నీనో ప్రభావాన్ని గుర్తించిన రైతులు ప్రజలు పంటలు వేయకుండా సాగునీరు,తాగునీరు పొదుపుగా వాడుకునేందుకు ప్రభుత్వానికి అధికార యంత్రాంగానికి సహకరించాలని సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నిరుపేద కుటుంబనికి మానాల ట్రస్ట్ అండ



**నిజామాబాద్, అక్టోబరు12 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆదివారం మానాల ట్రస్ట్ ద్వారా కమ్మర్పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో నిరుపేద కుటుంబం తోడేటి శాంత ఇందిరామ్మా ఇల్లుకి 50 సిమెంట్ బస్తాలు ఇవ్వటం జరిగింది.ఈ సందర్బంగా లబ్ధిదారులు శాంత వారి కుటుంబ సభ్యులు మాజీ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి కి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు బోనగిరి భాస్కర్,జిల్లా నాయకులు తీపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు నరేష్,విజయ్,తిరుపతి రెడ్డి,శ్రీనివాస్,రవి సధనాద్ శ్రీనివాస్,శేఖర్,గంగారెడ్డి,క్రాంతి,రాజేశ్వర్ శ్రీనివాస్,ముఖిమ్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి సిమెంట్ బస్తాల లోడు విరాళం.

- ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి



**నిజామాబాద్, అక్టోబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** నందిపేట్ మండల కేంద్రంలోని శ్రీ కేదారేశ్వర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనుల కోసం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి 630 సిమెంట్ బ్యాగులను విరాళంగా అందజేశారు.వీటి విలువ సుమారు రూ.2 లక్షల పైన ఉంటుందని ఆలయ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సిమెంట్ బ్యాగులను విరాళంగా అందించిన ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి శ్రీ కేదారేశ్వర అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే డొంకేశ్వర్,నందిపేట్ మండలాలకు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.ఆలయ నిర్మాణానికి అందించిన ఈ విరాళం పట్ల ఆలయ కమిటీ సభ్యులు,అయ్యప్ప స్వామి భక్తులు హర్షం వ్యక్తం చేశారు.అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు,ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శ్రీ శ్రీ శ్రీ కేదార్నంద స్వామి,అధ్యక్షులు సక్కర్ రెడ్డి గురుస్వామి,కోశాధికారి మల్లేష్ గురు స్వామి,కార్యదర్శులు మోర్తాడు ముత్యం గురు స్వామి,మంద శ్రావణ్ గురు స్వామి,ప్రజాపతి గురుస్వామి ఉన్నారు.

# షాబాద్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా తొంట రాములు

- జిల్లా స్థాయిలోనూ మన్మర్రి, షాబాద్ నాయకులకు కీలక పదవులు



**షాబాద్, అక్టోబరు12 (జర్నలిస్ట్ ఫైల్) :** షాబాద్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా షాబాద్ గ్రామానికి చెందిన తొంట రాములు నియమితులయ్యారు. అలాగే మన్మర్రి గ్రామానికి చెందిన అంతారం నర్సింలు జిల్లా ఎస్సీ సెల్ వైస్ ఛైర్మన్‌గా, షాబాద్‌కు చెందిన చౌక్కంపేట రామస్వామి జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు.చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ భీమ్ భరత్, ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ శ్రీధర్ నూతనంగా నియమితులైన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడుపల్లి పెంటారెడ్డి, పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, ఓబీసీ నాయకుడు తమ్మలి రవీందర్, షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్, మన్మర్రి మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సోషల్ మీడియా ప్రతినిధి సమీర్, సాయి కృష్ణ రెడ్డి, గూడూరు శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొని నూతనంగా నియమితులైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రాణాలకు ముప్పు కలగకముందే అధికారులు అన్ని అనుమతిలేని నిర్మాణాలను తనిఖీ చేసి, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## భక్తులు నవరాత్రి ఉత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి



○ మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి

**బ్రహ్మంగారిమఠం,అక్టోబర్ 12(జర్నలిస్ట్ ఫైల్ ):**శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం 12వ మఠాధిపతులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న తొలి శ్రీ దేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో ప్రతి దినము నిర్వహించు అమ్మవారి అలంకరణలు చేయడం మఠంలో ఇదే ప్రప్రథమం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారు తెలిపారు. లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించాలని, అన్ని వర్గాల వారికి ఈ పూజల్లో, ముఖ్యంగా మహిళలకు కుంకుమార్చనలో అవకాశం కల్పించాలనే సంకల్పంతో తొలిసారిగా అమ్మవారికి ప్రత్యేక అలంకారాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అందుకు తగ్గట్లుగా మఠంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు స్థానికులు శిష్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందరికీ స్వామివారి ఆశీస్సులు ఉండాలని సర్వేజనా సుఖినోభవంతు అని ఆకాంక్షించారు.

## ఎస్సై మర్రి సుబ్బారావు మృతి పట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సంతాపం



**గుంటూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మర్రి సుబ్బారావు గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన భౌతికకాయంపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

2012 బ్యాచ్‌కు చెందిన మర్రి సుబ్బారావు వట్టిచెరుకూరు, పాత గుంటూరు, లాలాపేట, ట్రాఫిక్, నల్లపాడు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. అంతకుముందు భారత సైన్యంలో, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతితో పోలీస్ శాఖలో విషాదం నెలకొంది.

## గుంటూరు మేయర్ పదవి జనరల్ మహిళకు కేటాయింపు

○ నగరపాలక సంస్థలో రిజర్వేషన్ల వివరాలు వెల్లడి

**గుంటూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** సాధారణ పురపాలక ఎన్నికలు--2026 నేపథ్యంలో సీడీఎంఏ ఉత్తర్వుల మేరకు గుంటూరు నగరపాలక సంస్థలో రిజర్వేషన్ల వివరాలను అధికారులు వెల్లడించారు. మేయర్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు.

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 76 వార్డులు ఉన్నాయి. వీటిలో ఎస్టీ జనరల్‌కు ఒకటి, ఎస్టీ మహిళలకు ఒకటి, ఎస్సీ జనరల్‌కు నాలుగు, ఎస్సీ మహిళలకు ఐదు వార్డులు కేటాయించారు.

బీసీ జనరల్‌కు 13, బీసీ మహిళలకు 14, జనరల్ మహిళలకు 20 వార్డులు కేటాయించగా, 18 వార్డులను అన్‌రిజర్వ్‌డ్‌గా ఉంచారు.

ఏ వార్డుకు ఏ రిజర్వేషన్ కేటగిరీ వర్తిస్తుందనే వివరాలను జిల్లా కలెక్టర్ నిబంధనల ప్రకారం పరిశీలించి, అక్టోబర్ 13, 2026లోగా సీడీఎంఏకు సమర్పించనున్నట్లు గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

## వాసవి అమ్మవారిశాలలో శారదా దేవి అలంకారంలో అమ్మవారు



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం స్థానిక అమ్మవారి శాలలో సోమవారం శారదాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఉభయ దాతలతో హోమము కుంకుమార్చన నిర్వహించడం జరిగింది.

దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చక్కటి ఏర్పాట్లు చేశారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# మంగళగిరిలో ఎంటీఎంసీ వైట్ ఫీల్డ్ ట్రీ పార్క్ ప్రారంభం

○ మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరిలో ఎంటీఎంసీ వైట్ ఫీల్డ్ ట్రీ పార్క్ ప్రారంభం

○ రూ.55 లక్షలతో అత్యాధునిక సౌకర్యాలతో పార్క్ అభివృద్ధి

○ ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో భారీ వృక్షాలకు పునర్జీవం - పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత



**మంగళగిరి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్):** మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ప్రత్యేక చొరవతో మంగళగిరి పట్టణంలో మరో ఆహ్లాదకరమైన పార్క్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళగిరిలోని వైట్ ఫీల్డ్ ట్రీ పార్క్‌ను టీడీపీ నాయకులు ఈరోజు ప్రారంభించారు.

ఎన్నారై ఆసుపత్రి వెనుక వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో ఎంటీఎంసీ, మిడ్ వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త సహకారంతో సుమారు రూ. 55 లక్షల వ్యయంతో ఈ పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పార్కును ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దినట్లు వివరించారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం సందర్భంగా తొలగించాల్సి వచ్చిన వృక్షాలను నరికివేయకుండా, మంత్రి నారా లోకేష్ చొరవతో ఆధునిక ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ పద్ధతిలో 83 చెట్లను తరలించి ఈ పార్కులో పునరస్థాపించడం అభినందనీయమని పోతినేని శ్రీనివాసరావు అన్నారు. అభివృద్ధి పనులతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వృక్ష సంపదను కాపాడే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు.

పార్కులో రిఫ్లెక్సాలజీ పాత్‌వే, విశాలమైన ప్లాజా, వాకింగ్ ట్రాక్, అంతర్గత నడక మార్గాలు, ఓపెన్ స్టేజ్, యోగా డెక్, సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక సీటింగ్ ఏరియా, ఆధునిక లైటింగ్, చిన్నారుల ఆటస్థలం, పచ్చిక బయళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పార్కు పరిసరాల్లో సుమారు 6500 మొక్కలను నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించారని వివరించారు.

మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలికి అవసరమైన పార్కులు, ఆహ్లాదకరమైన వాతావరణాల అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పోతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైట్ ఫీల్డ్ ట్రీ పార్క్ అందుబాటులోకి రావడం వల్ల స్థానిక ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నడక, యోగా, విశ్రాంతి కోసం చక్కని వేదిక లభించిందన్నారు.

ప్రకృతి పరిరక్షణ, పచ్చదనం పెంపుదల, ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఈ పార్క్ మంగళగిరి పట్టణానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ పార్క్ నిర్మాణానికి సహకరించిన మంత్రి నారా లోకేష్, ఎంటీఎంసీ అధికారులు, మిడ్ వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో నాయకులు గుత్తికొండ ధనుంజయరావు, నందం అబద్దయ్య, పడవల మహేష్, షేక్ రియాజ్, ఆరుద్ర భూలక్ష్మి, అబ్దుల్ కరీమ్, వంగర హనుమాన్, బుదాటి శ్రీనివాసరావు, పంది రామకృష్ణ,కొల్లి శ్రీనివాసరావు, కాకి మల్లికార్జున రావు, ఉప్పు మహేష్ మరియు అధికారులు, వైట్ ఫీల్డ్ అపార్ట్మెంట్ వాసులు షేక్ హుస్సేన్, రాఘవేంద్ర రావు, పూర్ణచంద్ర రావు, కుమార్, శివరామకృష్ణ, హర్షవర్ధన్, శ్రీధర్, త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

○ సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి: కమిషనర్ కె. మయూర్ అశోక్



**గుంటూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** స్థానిక సంస్థల ఎన్నికలకు నగరంలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై డీఎస్పీలు, తహసీల్దార్లు, నగరపాలక సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు.

జోనల్ అధికారులు, ఎస్‌హెచ్ఓలు, టీపీబీఓలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలతో పాటు పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

అభ్యర్థుల ప్రచారం, ర్యాలీలు, సమావేశాలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేసేందుకు సింగిల్ విండో విధానం ఏర్పాటు చేయాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ప్రతి ఫిర్యాదుపై నిష్పాక్షిక విచారణ : ఎస్పీ వకుల్ జిందాల్

○ నిర్ణీత గడువులో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలి



**గుంటూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా విచారించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ లో ఎస్పీతో పాటు పోలీస్ అధికారులు 147 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుపై వివరాలు తెలుసుకున్న ఎస్పీ, వాస్తవాలను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు ఆన్‌లైన్ ద్వారా పంపించి, నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేసి, వారి అభిప్రాయం తెలుసుకున్న అనంతరం పిటిషన్‌ను ముగించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక పరిష్కారాలకే పరిమితం కాకుండా సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలన్నారు.

పీఆర్జీఎస్ కు వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణలో పోలీస్ సిబ్బంది సహకరించారు. అనంతరం సాయినగర్‌లో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు పూర్ణచంద్రరావు, బెల్లం శ్రీనివాసరావు, పీఆర్జీఎస్ సీఐ బిలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో చిన్నారులకు దుస్తుల పంపిణీ



**గుంటూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లోని జింఖానా ఆరోగ్యశ్రీ కేంద్రం కాన్పుల వార్డులో పుట్టిన శిశువులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీ సీనియర్ నాయకుడు పోతురాజు వెంకట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని శిశువులకు దుస్తులు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మోతే శేషగిరి, జిల్లా నాయకులు దేసు సత్యనారాయణ, ఓబీసీ జిల్లా ట్రెజరర్ శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి బి. ఉషారాణి, దేవరపల్లి నిర్మల రాణి, మంగమ్మ, బోరుగడ్డ బాబురావు, పి.వి. రమ, పి. శివకుమారి, ఓ. రమణ, పి. శ్యామల, ఎస్‌కే. హుస్సేన్ బీ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

○ జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ



**గుంటూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):**జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్లోని విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తో కలసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు, తహసీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమన్వయ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలు, వార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించి మంగళవారం నాటికి పంపాలన్నారు. ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సాధారణ, సున్నిత, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాల జాబితాను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, వాటిని మరోసారి పరిశీలించాలని సూచించారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ఎన్నికల విధుల నిర్వహణకు ముందుగానే సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వస్తుందన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు సంబంధించి సమావేశాలు, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్ల వినియోగం తదితర అనుమతుల జారీకి సింగిల్ విండో విధానాన్ని అమలు చేయాలన్నారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లి మాట్లాడుతూ, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించే ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గత అనుభవాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమస్యాత్మక గ్రామాలు, వార్డులను గుర్తించాలన్నారు.

బైండ్ ఓవర్ కేసులుపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించడం ద్వారా శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించాలని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డిపిఓ సాయికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు రాజకీయ అధికారం కల్పించడంలో వైసీపీకి చిత్తశుద్ధి లేదు



○ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, అక్టోబర్ 12(జర్నలిస్ట్ ఫైల్):** బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల విషయంలో గత ప్రభుత్వ వైఖరి వల్ల సుమారు 17 వేల రాజకీయ పదవులు దూరమయ్యాయని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. బీసీల రాజకీయ సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు నిధుల కొరత ఏర్పడగా, కూటమి ప్రభుత్వం రూ. 4,000 కోట్ల నిధులు అందించిందని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ద్వారా అధ్యయనం చేయించామని, నివేదిక ఆధారంగా 28.1 శాతం రిజర్వేషన్ల అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. పార్టీ పరంగా బీసీలకు 40 శాతానికి తగ్గకుండా ప్రాధాన్యం కల్పిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల వంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధితో పాటు రూ. 640 కోట్లతో తాగునీటి పథకం చేపట్టామని, 15 నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు.

## గ్రామ అభివృద్ధే నా ధ్యేయం



○ కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్

**పామూరు అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ అభివృద్ధే తన ధ్యేయమని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం బీసీ కాలనీ (ఇరిగినేని నగర్)లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల స్థానికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

గత ఐదేళ్లలో గ్రామ అభివృద్ధి కుంటుపడిందని, అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను సొంత నిధులతో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చంద్రశేఖర్ తెలిపారు. బీసీ కాలనీలో రామాలయం, చౌడమ్మ, పెద్దమ్మ దేవస్థానాల అభివృద్ధితో పాటు జంగాలపల్లిలో గంగమ్మ దేవస్థానం అభివృద్ధికి చర్యలు చేపడతానన్నారు.

ఎస్సీ కాలనీలో ప్రార్థనా మందిరం అభివృద్ధి, స్మశాన వాటిక వద్ద షెడ్డు నిర్మాణం, నీటి వసతి కోసం బోరు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పోతవరం స్మశాన వాటికకు రహదారి నిర్మాణం కోసం స్థానిక రైతులతో చర్చించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రకటించిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. జెడ్పీటీసీ, తూర్పు కోడిగుడ్లపాడు ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన ఉపాధ్యాయుల నుంచి ఫీజు వసూలు ఆపాలి

○ ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు, ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహది డిమాండ్

**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):**జిల్లాల వారీగా ఉద్యోగుల విభజనలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ప్రాధాన్యత కల్పించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య ధ్రువపత్రాల జారీకి ఆదేశాలు ఇచ్చిందని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) తెలిపింది.

అయితే కర్నూలు జిల్లాలో ప్రత్యేక వైద్య ధ్రువపత్రాల కోసం వచ్చే ఉపాధ్యాయుల నుంచి రూ. 4 వేల ఫీజు వసూలు చేస్తున్నారని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహది తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధ్రువపత్రాలు పొందేందుకు వచ్చే ఉపాధ్యాయుల నుంచి ఈ విధంగా ఫీజు వసూలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఈ విషయాన్ని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి పేరుతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయుల నుంచి ఫీజు వసూలు చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు జిల్లాల వారీగా ఉద్యోగుల విభజనలో ప్రాధాన్యత కల్పించే ప్రక్రియలో ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆప్టా నాయకులు కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# సృజనాత్మకతకు ప్రోత్సాహం.. అభివృద్ధికి నూతన మార్గం




- విశ్వకర్మ క్రియేటివ్ స్పేసెస్ డిజైనర్ వర్క్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** పట్టణంలో నూతన వ్యాపార సంస్థల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. తెనాలి బోస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విశ్వకర్మ క్రియేటివ్ స్పేసెస్ డిజైనర్ వర్క్స్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆధునిక కాలంలో డిజైనింగ్ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని ఆలపాటి పేర్కొన్నారు. సృజనాత్మక ఆలోచనలతో నాణ్యమైన సేవలు అందించే సంస్థలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. కొత్త ఆలోచనలు, నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ప్రతిభకు సృజనాత్మకత తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని, నాణ్యతకు నమ్మకం జతైతే విజయానికి తిరుగుండదని ఆలపాటి అన్నారు. విశ్వకర్మ క్రియేటివ్ స్పేసెస్ డిజైనర్ వర్క్స్ సంస్థ భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

తెనాలి పట్టణంలో మరిన్ని నూతన వ్యాపార సంస్థలు అభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 12వ పీఆర్సీ కమిషనర్‌ను కలిసిన సచివాలయ సంఘం



- ఉద్యోగులకు న్యాయబద్ధమైన ఫిట్‌మెంట్, ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి

**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** 12వ వేతన సవరణ సంఘం (12వ పీఆర్సీ) కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ ను ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా 12వ పీఆర్సీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం జరిగేలా పరిగణనలోకి తీసుకోవాల్సిన పలు కీలక అంశాలను సంఘం ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 11వ పీఆర్సీలో ప్రకటించిన ఫిట్‌మెంట్ కారణంగా, అంతకుముందు ఉద్యోగులకు లభించిన మధ్యంతర భృతి (ఐఆర్)తో పోలిస్తే ఆశించిన స్థాయిలో ఆర్థిక ప్రయోజనం దక్కలేదని వివరించారు.

ఫిట్‌మెంట్‌కు అనుగుణంగా వివిధ అలవెన్సులు, రుణాలు, అడ్వాన్సులు, ఇన్సెంటివ్‌లను తగిన విధంగా సవరించకపోవడం వల్ల కూడా ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, ఉద్యోగులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా 12వ పీఆర్సీలో సహేతుకమైన ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేయాలని కోరారు.

12వ పీఆర్సీ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయడంతో పాటు, ఫిట్‌మెంట్‌తో అనుసంధానమైన అలవెన్సులు, రుణాలు, అడ్వాన్సులు, ఇన్సెంటివ్‌లను కూడా సమగ్రంగా సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

సంఘం ప్రతినిధులు వివరించిన అంశాలను దినేష్ కుమార్ శ్రద్ధగా ఆలకించి సానుకూలంగా స్పందించారు. పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఉద్యోగ సంఘాలు సమర్పించే అంశాలను పరిశీలించి, తగిన విధంగా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

12వ పీఆర్సీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయబద్ధమైన వేతన సవరణ, మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు లభించేలా ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం తన వంతు కృషిని కొనసాగిస్తుందని సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ తెలిపారు.

# హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌తో సంబంధం లేకుండా అందరికీ తల్లికివందనం నగదు చెల్లించాలి

**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నిబంధనల,ఇతర సాంకేతిక కారణాలతో తల్లికి వందనం నగదు అందని తల్లులకు న్యాయం చేయాలని చెల్లించాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నిబంధనలతో తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం అందలేదని కృష్ణా జిల్లా,చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామానికి చెందిన కైతేపల్లి రాజకుమారి తెలిపారు.ఇదే విషయాన్ని సురేష్ బాబు దృష్టికి తీసుకువచ్చారు.

తన కుటుంబ హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ సభ్యుల వివరాలు మార్పులు చేసినప్పటికీ తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం నగదు చెల్లించలేదన్నారు. స్వర్ణ వార్డు సచివాలయం,జిల్లా కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదని రాజకుమారి తెలిపారు.

ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నిబంధనలతో పలువురు తల్లులకు తల్లికి వందనం అందలేదని తెలిపారు. హౌస్ మ్యాపింగ్ విధానంలో నిబంధనలను రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినందున అధికారులు వెంటనే సంబంధించిన జీవోలను విడుదల చేసి ప్రతి ఒక్కరికి తల్లికి వందనం అందేలా చూడాలని కోరారు.

తల్లికి వందనం నగదు కొందరికి చెల్లించి,మరికొందరికి అందకపోవడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు రావడంతో పాటు తల్లికి వందనం లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. హౌస్ ఓల్డ్ మ్యాపింగ్,ఇతర నిబంధనలతో సంబంధం లేకుండా 70 శాతం పైగా హాజరు ఉన్న విద్యార్థుల తల్లులు ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం నగదు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అసోసియేషన్ పక్షాన లేఖ రాసినట్లు సురేష్ బాబు పేర్కొన్నారు.

# 2.5 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు

- 14.75 లక్షల మందికి కంటి పరీక్షలు.. 1.21 లక్షల మందిలో దృష్టి లోపాల గుర్తింపు
- కొనసాగుతున్న స్క్రీనింగ్
- 13 జిల్లాల్లో కళ్లద్దాల కొనుగోలుకు టెండర్ల ప్రక్రియ పూర్తి



**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరంలో 2.50 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇందుకోసం రూ. 7 కోట్ల వరకు ఖర్చు చేయనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

**14.75 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు**

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6-18 ఏళ్ల వయస్సు గల విద్యార్థులకు ఈ ఏడాది జూలై నుంచి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబరు 30 నాటికి .రాష్ట్రవ్యాప్తంగా 9,728 పాఠశాలల్లో పరీక్షలు పూర్తయ్యాయి. మొత్తం 14,75,877 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, 1,21,313 మందిలో దృష్టి లోపాలను గుర్తించారు. వీరిలో 1,16,866 మందికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు సూచించారు. మిగిలిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించే ప్రక్రియ కొనసాగుతోంది.

ప్రభుత్వ వసతి విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యార్థుల్లో కంటి సమస్యలను గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందించేందుకు 15,024 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

**13 జిల్లాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి**

విద్యార్థులకు పంపిణీ చేసేందుకు కళ్లద్దాల కొనుగోలుకు సంబంధించి 13 జిల్లాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన జిల్లాల్లోనూ త్వరలో ఈ ప్రక్రియను పూర్తి చేసి విద్యార్థులకు కళ్లద్దాలు అందించనున్నారు. కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, చికిత్స అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోపాల నియంత్రణ కార్యక్రమం మార్గదర్శకాల ప్రకారం దీనిని అమలు చేస్తున్నారు.

2025-26లో 95 వేల మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా, 2026-27 విద్యాసంవత్సరంలో ఈ లక్ష్యాన్ని 2.50 లక్షలకు పెంచింది.

**సెప్టెంబరు వరకే 2.83 లక్షల కంటిశుక్లం శస్త్రచికిత్సలు**

జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోపాల నియంత్రణ కార్యక్రమం కింద పెద్దలకు కంటిశుక్లం శస్త్రచికిత్సలు నిర్వహించడంతోపాటు నేత్రదానం, కార్నియా సేకరణ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

2026-27 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు వరకు రాష్ట్రవ్యాప్తంగా 2,83,455 కంటిశుక్లం శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఇదే కాలానికి నిర్దేశించిన 2 లక్షల శస్త్రచికిత్సల లక్ష్యాన్ని అధిగమించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 4 లక్షల శస్త్రచికిత్సలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

నేత్రదానం, కార్నియా సేకరణలో భాగంగా సెప్టెంబరు వరకు 3,750 సేకరణలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, 2,824 నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి 7,500 సేకరణలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**గతేడాది లక్ష్యానికి మించి శస్త్రచికిత్సలు**

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి 4,10,000 కంటిశుక్లం శస్త్రచికిత్సలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించగా, 4,55,122 శస్త్రచికిత్సలు చేశారు. అదే ఏడాది 7,300 నేత్రదానాలు, కార్నియా సేకరణలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, 5,872 సేకరణలు నమోదయ్యాయి.

**అంధత్వ సమస్యలను 0.25 శాతానికి తగ్గించడమే లక్ష్యం**

దేశంలో అంధత్వ ప్రాబల్యాన్ని 0.25 శాతానికి తగ్గించడమే జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోపాల నియంత్రణ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ద్వారా కంటిశుక్లం శస్త్రచికిత్సలు, పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు, దృష్టి లోపాలున్న పిల్లలకు ఉచిత కళ్లద్దాలు, అవసరమైన చికిత్స అందిస్తున్నారు. నేత్రదానం, కార్నియా సేకరణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల్లో కంటి సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వారికి కళ్లద్దాలు, తదుపరి వైద్య సేవలు అందించేందుకు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

# విజయవాడలో తొలిసారిగా జాతీయ స్థాయి సరస్ మేళా

- అక్టోబర్ 15 నుంచి 31 వరకు నిర్వహణ
- 31 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి మహిళా వ్యాపారవేత్తల భాగస్వామ్యం

**విజయవాడ, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెట్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా ఢిల్లీ--ఎన్‌సీఆర్ ప్రాంతం వెలుపల జాతీయ సరస్ మేళా విజయవాడలో నిర్వహించనున్నారు. పున్నమి ఘాట్ సమీపంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో అక్టోబర్ 15 నుంచి 31 వరకు జరిగే ఈ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో, విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని నేతృత్వంలో మేళా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దేశవ్యాప్తంగా 31 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి మహిళా కళాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు.

571కు పైగా స్టాళ్లలో చేనేత, హస్తకళలు, సహజ ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, సంప్రదాయ గ్రామీణ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించనున్నారు. సుమారు 1,142 మంది పాల్గొనేవారు, కళాకారులు, వాలంటీర్లతో మేళా సందడిగా సాగనుంది.

దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్‌లో భాగంగా నిర్వహించే సరస్ మేళా గ్రామీణ మహిళలకు ఉత్పత్తుల విక్రయానికి మాత్రమే కాకుండా వినియోగదారుల అభిరుచులను తెలుసుకోవడం, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడం, వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి వేదికగా నిలవనుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ వంటి వేదికల ద్వారా మార్కెట్ అవకాశాలను పెంచేందుకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే లఖ్‌పతి దీదీ కార్యక్రమానికి మేళా ప్రత్యేక వేదికగా నిలవనుంది. విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తల అనుభవాలను పంచుకునే లఖ్‌పతి దీదీ పెవిలియన్‌తో పాటు ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఈ-కామర్స్, సోషల్ మీడియా మార్కెటింగ్, వ్యాపార ప్రణాళికలపై శిక్షణ ఇచ్చే లెర్నింగ్ అండ్ నాలెడ్జ్ పెవిలియన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక సహకారం, మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు కన్వర్జెన్స్ పెవిలియన్, మహిళా కళాకారులు ఉత్పత్తుల తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా ప్రదర్శించే డెమాన్‌స్ట్రేషన్ పెవిలియన్ ఏర్పాటు చేయనున్నారు. వివిధ రాష్ట్రాల ప్రాంతీయ వంటకాలను అందించే ఇండియా ఫుడ్ కోర్టులో 50కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు.

వివిధ రాష్ట్రాల కళలు, హస్తకళలు, వస్త్ర సంప్రదాయాలు, సంగీతం, నృత్య ప్రదర్శనలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 1999లో ఢిల్లీలో సుమారు 65 మంది లబ్ధిదారులతో ప్రారంభమైన జాతీయ సరస్ మేళా ఇప్పటివరకు 117 మేళాలను నిర్వహించింది. తొలిసారిగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ వెలుపల విజయవాడను వేదికగా ఎంపిక చేయడం రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకొచ్చింది.

గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తులు, ప్రతిభ, సంప్రదాయ కళలు, వ్యాపార సామర్థ్యాన్ని దేశవ్యాప్తంగా వినియోగదారులకు పరిచయం చేయడమే మేళా ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. విజయవాడలో నిర్వహించనున్న ఈ జాతీయ స్థాయి సరస్ మేళా ద్వారా గ్రామీణ మహిళలకు కొత్త మార్కెట్లు, కొనుగోలుదారులు, వ్యాపార సంస్థలతో అనుసంధానం పెరగడంతో పాటు నగరానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించనుంది.

# బీజేపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా క్రిష్టిపాటి నారాయణరెడ్డి



**గుంటూరు, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** బీజేపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా క్రిష్టిపాటి నారాయణరెడ్డిని నియమించారు. గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయం వాజపేయి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు నియామక పత్రాన్ని అందజేశారు.

దక్షిణ మధ్య రైల్వేలో స్టేషన్ సూపరింటెండెంట్‌గా, మజ్దూర్ యూనియన్ గుంటూరు డివిజన్ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి సుదీర్ఘకాలం సేవలందించారు. ఉద్యోగ విరమణ అనంతరం రైల్వే పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2024లో బీజేపీలో చేరి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

పార్టీ నాయకత్వం తొలుత ఆయనను గుంటూరు జిల్లా కార్యదర్శిగా నియమించింది. అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి బీఎల్ఏ-1గా బాధ్యతలు అప్పగించింది. బీఎల్ఏ-1గా ఆయన చూపిన సామర్థ్యం, పార్టీ పట్ల నిబద్ధత, సంస్థాగత అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

నారాయణరెడ్డి అనుభవం, కార్యదక్షత జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ఐఆర్‌పై విపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి : రాష్ట్ర బీజేపీ

**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధులు సాధినేని యామినీ శర్మ, షేక్ బాజీతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ కొత్తగా తీసుకొచ్చిన ప్రక్రియ కాదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజాప్రాతినిధ్య చట్టం--1950లోని సెక్షన్ 21 ప్రకారం ఎన్నికల జాబితాల పునఃసమీక్షకు ఎన్నికల సంఘానికి అధికారాలు ఉన్నాయని దిలీప్ తెలిపారు. గతంలోనూ పలుమార్లు ఈ ప్రక్రియ నిర్వహించారని, ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్‌ను బీజేపీ లేదా ఎన్డీఏ ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టినట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఓటర్ల




జాబితాల్లో మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో అర్హులైన ఏ ఒక్క ఓటరికి అన్యాయం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు ఈ ప్రక్రియలో భాగస్వాములవుతున్నందున, మొత్తం ప్రక్రియ ఏకపక్షంగా జరుగుతోందని ఆధారాలు లేకుండా ఆరోపించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ అన్నారు. ప్రజా సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ విధానాలు, సామాజిక అంశాలపై ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. ఎస్ఐఆర్‌పై అనవసర అనుమానాలు సృష్టించకుండా వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామినీ శర్మ పేర్కొన్నారు. నిరసనలు తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించినప్పటికీ ప్రభుత్వ, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడానికి ఎవరికీ హక్కు లేదన్నారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ఆరోపణలు చేసేటప్పుడు ఆధారాలు చూపాలని సూచించారు.

ఫారం-7 ద్వారా ఓటరు పేరు తొలగింపునకు సంబంధించిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా, అనర్హమైన నమోదులు కొనసాగకుండా చూడాలని యామినీ శర్మ అన్నారు. ఓటరు జాబితాల్లో అక్రమాలు ఉన్నాయని భావిస్తే సంబంధిత ఆధారాలను అధికారులకు సమర్పించి చట్టబద్ధంగా పరిష్కారం కోరాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షిస్తూ ఎన్నికల జాబితాలను పారదర్శకంగా రూపొందించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని కిలారి దిలీప్ తెలిపారు

# అధునాతన పరిశోధనలోనూ ఎస్ఆర్ఎం టాప్

- ప్రపంచంలోని టాప్ 2% శాస్త్రవేత్తల జాబితాలో 20 మంది ఎస్ఆర్ఎం వారే
- ఒక్కొక్కరికి 50 వేల నగదు పారితోషికం అందజేత
- సత్కరించి ప్రోత్సహించిన వర్సిటీ యాజమాన్యం




**అమరావతి, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పరిశోధనా రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. యూనివర్సిటీకి చెందిన 20 మంది అధ్యాపకులు ప్రపంచంలోని అత్యుత్తమ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో చోటు సంపాదించారు. గత ఏడాది ఈ జాబితాలో ఏడుగురు అధ్యాపకులు మాత్రమే ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్య 20కి పెరగడం విశేషం.

స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు ఎల్సెవియర్ సంస్థ సహకారంతో రూపొందించిన ఈ జాబితా, స్కోపస్ (డాఏశీజూబం) పరిశోధనా ఉల్లేఖన గణాంకాల ఆధారంగా శాస్త్రవేత్తల పరిశోధనా కృషిని గుర్తించింది. ఇంజినీరింగ్, పర్యావరణ శాస్త్రాలు, గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఎనర్జీ ఇంజినీరింగ్‌తో పాటు అంతరశాఖ పరిశోధనల్లో విశేష కృషి చేసిన శాస్త్రవేత్తలకు ఈ గుర్తింపు లభించింది. ప్రొఫెసర్లు సమర్పించిన పరిశోధన పత్రాలను పరిశీలించిన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వీరి ఘనతను గుర్తించి టాప్ 2 శాతం జాబితాలో వీరి పేర్లను నమోదు చేసింది. ఈ ఘనత యూనివర్సిటీ పరిశోధనా సామర్థ్యం అంతర్జాతీయ స్థాయిలో క్రమంగా విస్తరిస్తోందనడానికి నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే పరిశోధనా సంస్థగా ఎదగాలన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లక్ష్యానికి ఇది మరింత బలాన్నిస్తోంది.

ఈ సందర్భంగా సోమవారం ఉదయం యూనివర్సిటీ థియేటర్లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి శాస్త్రీయ పరిశోధనా ప్రచురణ వెనుక ఎంతో కృషి, నిబద్ధత ఉంటాయని పేర్కొన్నారు. కేవలం పరిశోధనా ప్రచురణల సంఖ్యకే ప్రాధాన్యం ఇవ్వకుండా, పరిశోధనల నాణ్యతకు, దీర్ఘకాలిక ప్రభావానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అవార్డు గ్రహీతలు నిర్దిష్ట లక్ష్యాలతో పరిశోధనలను కొనసాగిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన శాస్త్రవేత్తల సంఖ్యను యూనివర్సిటీలో మరింత పెంచేందుకు కృషి చేయాలని ఆయన ప్రోత్సహించారు.

### టాప్ 2% శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్లు వీరే..

యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రంగభాషియం సెల్వసెంబియన్, డాక్టర్ ఆదిత్య కుమార్ సాహు, డాక్టర్ రణధీర్ కుమార్, ప్రొఫెసర్ కార్తీక్ రాజేంద్రన్, డాక్టర్ ఆకాష్ బాలకృష్ణన్, డాక్టర్ దెబ్లినా దత్తా, డాక్టర్ వినోద్‌కుమార్ ఎటాచేరి, డాక్టర్ పింటు భూనియా, డాక్టర్ గుండా మోహనకృష్ణ, డాక్టర్ క్షీర సాగర్ సాహూ, డాక్టర్ ప్రభుజిత్ మొహపాత్ర, డాక్టర్ సుమిత్ కుమార్ మెహతా, డాక్టర్ బసబెందు బర్మన్, ప్రొఫెసర్ సరాజు మొహంతి, ప్రొఫెసర్ ఉపద్రష్ట రామమూర్తి, ప్రొఫెసర్ కొరాడో డి నాటాలే, ప్రొఫెసర్ యోషియుకి కవాజో, ప్రొఫెసర్ మెత్థిక సుహర్షిణి వితానగే, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ పొలవరపు, డాక్టర్ సుదీప్ పాన్ లు గుర్తింపు పొందిన వారిలో ఉన్నారు. మంగళవారం నాటి సన్మాన కార్యక్రమం లో యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ వినాయక్ కలూరి, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాప, డైరెక్టర్లు పాల్గొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com